
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కృష్ణా
జిల్లా వార్తలు
శనివారం 30 ఆగస్టు 2025



తెలుగుతల్లి విగ్రహానికి కలెక్టర్ బాలాజీ నివాళి

తెలుగు భాషాభివృద్ధికి కృషి

- తెలుగు భాషా దినోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల
- కలెక్టరేట్‌లోని తెలుగుతల్లి విగ్రహానికి కలెక్టర్ బాలాజీ నివాళి 8





భళా.. తబలా..

మచిలీపట్నంలోని పోర్టు రోడ్డులో ఏర్పాటుచేసిన తబలా వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. ఈ గణపతి తబలా వాయిస్తున్నట్టుగా అందంగా తీర్చిదిద్దగా, వెనుక నుంచి వినసొంపైన సంగీతం భక్తులను ఆకట్టుకుంటోంది. ప్రత్యేకంగా కొలువుదీరిన ఈ గణనాథుడిని చూడటానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.



కార్లపైకి ఎక్కి అల్లరి

ఖిల్లాపై అల్లరల్లరి

ఆకతాయిల మందు పార్టీ.. కేకలు.. అరుపులు

30 మోటార్ బైకులు, 10 కార్లలో వచ్చి గోలగోల

- పర్యాటక ప్రాంతంలో టేబుళ్లు వేసుకుని మందు పార్టీ
- అనంతరం వారిలో వారే కొట్టుకుని రచ్చ
- భయపడి వెళ్లిపోయిన పర్యాటకులు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం) : వినాయకచవితి రోజున విజయవాడకు చెందిన సుమారు 50 మంది యువకులు, కొందరు యువతులు సుమారు 30 మోటార్ బైకులు, పది కార్లతో కొండపల్లి ఖిల్లాకు వచ్చారు. ప్రకృతి అందాలు చూడటం మానేసి మందు పార్టీ మొదలుపెట్టారు. వీరు చేసిన వికృత చేష్టలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. కార్లలో ఏకంగా రెడీమేడ్ టేబుళ్లు, కుర్చీలు తీసుకొచ్చి సిట్టింగ్ వేసి మరీ పబ్లిక్‌గానే మద్యం సేవించారు. ఆ మత్తులో కార్లపై కూర్చుని హారన్లు మోగిస్తూ, వీడియోలు తీసుకుంటూ ఘాట్‌రోడ్డుపై కోతిమూకను తలపించారు. వీరి చేష్టలకు పర్యాటకులు భయపడిపోయారు. చివరికి వారిలో వారికే గొడవై కొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు వెళ్లి వారిని చెదరగొట్టారు. ఈ ఆకతాయిలు చేసిన అల్లరి మొత్తం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అసలు వీరు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనే విషయాన్ని పోలీసులు కూపీ లాగుతున్నారు.

పర్యాటకం మాటున పాడు పనులు

ఎంతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన కొండపల్లి ఖిల్లాపై పర్యాటకం పేరుతో యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతోంది. ఇలాంటి ఘటనలు జరగడం ఇదేం కొత్త కాదు. గతంలోను మిగతా 6లో..



కొండపల్లి ఖిల్లాపై మందు తాగుతున్న యువకులు

కొండపల్లి ఖిల్లాపై ఆకతాయిలు అల్లరి సృష్టించారు. పది కార్లు, 30 మోటార్ బైకులపై ఈలలు, అరుపులు, హారన్లతో రచ్చరచ్చ చేశారు. బార్ అండ్ రెస్టారెంట్ తరహాలో ఖిల్లా ప్రాంగణంలో టేబుళ్లు వేసుకుని మద్యం సేవించారు. వీరిని చూసి పర్యాటకులు భయపడిపోయారు. చాలామంది అక్కడి నుంచి వచ్చేశారు. ఈ గ్యాంగ్‌లో యువకులతో పాటు కొందరు యువతులు కూడా ఉన్నారు.

జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు స్వామిత్వ సర్వే గుదిబండలా మారింది. సర్వేను ఈ నెలాఖరులోగా పూర్తిచేసి సంబంధిత పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని జిల్లా పంచాయతీ కార్యాలయ (డీపీవో) అధికారులు ఒత్తిడి కత్తి పెడుతున్నారు. జూమ్ మీటింగ్‌లు నిర్వహించి.. ఇంటింటికీ వెళ్లి సర్వేచేసి, సరిహద్దులు, విస్తీర్ణం, ఖాళీ జాగాలను కొలిచి, స్వామిత్వ పోర్టల్‌లో నమోదుచేసే ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని చెబుతుండటంతో పంచాయతీ కార్యదర్శులు బెంబేలెత్తిపోతున్నారు.

సర్వే కష్టాలు

పంచాయతీ కార్యదర్శులపై స్వామిత్వ సర్వే బండ

ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశాలు

- సర్వేయర్లు, వీఆర్వోలు లేకుండా ఎలా అని ప్రశ్న
- సరైన మిషనరీ కూడా లేదని కార్యదర్శుల ఆవేదన
- అయినా.. జూమ్ మీటింగ్‌లు నిర్వహించి హడావిడి
- పొట్లపాలెం గ్రామంలో నేటికీ కొలిక్కిరాని సర్వే



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 474 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని వ్యవసాయ భూములను సర్వే చేసిన అనంతరం గ్రామాల సరిహద్దులు నిర్ణయించాలి. వ్యవసాయ భూముల సర్వేను పూర్తిచేశాక ఆయా గ్రామాలు గ్రామకంఠం భూముల్లో ఉంటే సంబంధిత రీసర్వే నెంబర్ల ఆధారంగా సదరు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలి. సర్వే నెంబర్లు వీఆర్వోలు, సర్వేయర్ల వద్దే ఉంటాయి. వారు లేకుండా.. పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్ ద్వారానే ఈ సర్వే పూర్తిచేయాలని డీపీవో కార్యాలయ అధికారులు ఒత్తిడి తేవడం గమనార్హం. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో, సర్వేయర్లతో కూడిన బృంద సభ్యులు ఇంటింటి సర్వే చేయాలని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. కానీ, కీలకమైన మిగతా 6లో..

రోవర్‌లు, డ్రోన్‌లు అద్దెకు తెచ్చుకోవాలని ఆదేశాలు

పంచాయతీల్లో ఇంటింటి సర్వే చేసేందుకు రోవర్‌లు, డ్రోన్‌లు అందుబాటులో లేవని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నా.. డీపీవో కార్యాలయ అధికారులు వినట్లేదు. రోవర్‌లు, డ్రోన్‌లను అద్దెకు తెచ్చి సర్వే చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నారని, వీటికి సంబంధించిన ఖర్చును ఏ పద్దులో రాయాలని ప్రశ్నిస్తున్నారు. రోవర్‌లు, డ్రోన్‌లతో సర్వే చేశాక ఆన్‌లైన్‌లో ప్రోపర్టీ పార్శిల్ నెంబరు (పీపీఎన్)లో ఈ వివరాలను నమోదు చేయాలని, అసలు యంత్రాలు ఇవ్వకుండానే సర్వే చేయాలని తమను ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

గ్రామాల్లో గందరగోళం

2020లో తొలివిడతగా మచిలీపట్నం మండలంలోని పొట్లపాలెంలో భూముల సర్వేను ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ గ్రామంలోని వ్యవసాయ భూములను తొలివిడతగా కొలిచారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. అనంతరం ఈ పంచాయతీలోని ఇళ్ల సరిహద్దులకు రీసర్వే చేశారు. ఇంటి స్థలాలు, భూముల సరిహద్దులు సర్వేలో సక్రమంగా నమోదు చేయకపోవడంతో రైతులు, ఇంటి యజమానుల మధ్య గొడవలు జరిగి పోలీసు కేసులు పెట్టుకునే వరకూ వెళ్లింది. పొట్లపాలెం గ్రామం తరువాత ఈ గ్రామం సమీపంలోని కొత్తపూడి, తవసిపూడి గ్రామాల్లోనూ సర్వే చేశారు. ఈ సర్వే పూర్తై నాలుగేళ్లయినా ఈ గ్రామాలకు సంబంధించిన కచ్చితమైన భూమి రికార్డులు నేటికీ తయారుకాకపోవడం గమనార్హం.



బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు సంజీవని..

టెనెక్ట్‌ప్లాజా

- గోల్డెన్ అవర్‌లో వస్తే నాలుగు గంటల్లోనే సాధారణ స్థితికి..
- రూ.40 వేల ఖరీదైన ఇంజక్షన్ ఉచితంగా వేస్తారు
- అధిక ఒత్తిడి, ఆలోచనల వల్లే బ్రెయిన్ స్ట్రోక్

బ్రెయిన్ స్ట్రోకా.. అయితే ఆందోళన చెందకండి. గోల్డెన్ అవర్‌లో స్పందించి రోగికి వెంటనే టెనెక్ట్‌ప్లాజా ఇంజక్షన్ చేయిస్తే చాలు. ఆ రోగి మూడు నుంచి నాలుగు గంటల్లోనే కోలుకునే అవకాశముందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రూ.39 వేల నుంచి రూ.50 వేల విలువైన ఈ ఇంజక్షన్‌ను ఉచితంగానే చేస్తున్నారు. అదెక్కడ..? వివరాలు ఏంటి?

కథనం 6లో..

దివిసీమలో వరద తగ్గుముఖం

- ఊపిరి పీల్చుకుంటున్న లంక గ్రామాలు 8



నిన్నటికి నిన్న టెండర్లను జామ్ చేశారు.. నేడేమో ఏకంగా రద్దు చేశారు. విజయవాడ శివారు ప్రాంతాల రోడ్ల విస్తరణ పనుల విషయంలో సీఆర్‌డీఏ అనుసరిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలానా కారణంతో రద్దు చేశామన్న సమాచారాన్ని ఇవ్వకపోవడంపై చిన్న కాంట్రాక్టర్లు మండిపడుతుండగా, బడాసంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాల్లో భాగంగానే ఇది జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

చిన్న కాంట్రాక్టర్లకు టెండర్ పెట్టారు..!

బెజవాడ శివారు రోడ్ల పనుల టెండర్లు రద్దు

అర్హత కలిగిన కాంట్రాక్టర్లు ఉన్నా అర్థంతరంగా నిర్ణయం

- ఖర్చు, సమయం వృథా అంటున్న చిన్న కాంట్రాక్టర్లు
- గంపగుత్తగా టెండర్ పిలిచి బడాసంస్థకు అప్పగించాలనే..
- యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన పనుల్లో సీఆర్‌డీఏ నిర్లక్ష్యం
- అధికారుల తీరుపై విమర్శలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఒకపక్క విజయవాడ నగర, శివారు ప్రాంతాల ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే, మరోపక్క సీఆర్‌డీఏ వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ శివారు రోడ్ల టెండర్ల పనులను ఓ బడా సంస్థకు కట్టబెట్టేందుకు టెండర్ల రద్దు డ్రామాకు తెరలేపిందన్న ఆరోపణలు వస్తున్నాయి. చిన్న కాంట్రాక్టర్లను వదిలించుకుని పెద్ద కాంట్రాక్టర్‌కు కట్టబెట్టాలంటే టెండర్లను రద్దు చేయటం తప్ప మరో మార్గం లేదని భావించే.. టెక్నికల్ బిడ్ టెండర్లను ఖరారు చేయకుండా గడువు పొడిగిస్తున్నారని టెండర్లు వేసిన మిగతా 6లో..



గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డు విషయంలోనూ దోబూచులాట

గుంటూరు నగరంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్-3 విస్తరణ పనుల కోసం రూ.34 కోట్లతో టెండర్లు పిలిచారు. మంచి స్పందన వచ్చింది. ఆరు కాంట్రాక్టు సంస్థలు పాలు పంచుకున్నాయి. టెక్నికల్ బిడ్లు కూడా తెరిచారు. కానీ, ఫైనాన్షియల్ బిడ్లను పిలవకుండా తాత్సారం చేస్తున్నారు. ఈ టెండర్‌ను కూడా రద్దు చేయాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ఇప్పటికే టెక్నికల్ బిడ్లు తెరిచి ఉండటంతో ఏం చేయాలో సీఆర్‌డీఏకు పాలుపోవట్లేదు. టెక్నికల్ బిడ్లు తెరిచాక కాంట్రాక్టర్లు కోర్టుకు వెళితే, ఆ తర్వాత న్యాయస్థానం ప్రశ్నిస్తే సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో న్యాయసలహా తీసుకున్నాక టెండర్ల రద్దుపై తుది నిర్ణయం తీసుకోవాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ఓపెన్ డల్.. రిజర్వేషన్ ఫుల్

ఉమ్మడి కృష్ణాలో బార్ల దరఖాస్తుల లెక్క ఇది

- రిజర్వేషన్ కేటగిరీలో బార్ల ఏర్పాటుకు భారీగా..
- ఓపెన్ కేటగిరీకి మాత్రం అంతంతమాత్రమే..
- కలెక్టర్ కార్యాలయాల్లో నేడు లాటరీ



(ఆంధ్రజ్యోతి-విజయవాడ/మచిలీపట్నం) : కొత్త బార్ పాలసీకి దరఖాస్తుదారుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే వచ్చింది. రిజర్వేషన్ కేటగిరీలో బార్లకు భారీగానే దరఖాస్తులు అందగా, ఓపెన్ కేటగిరీకి అనుకున్నంత స్పందన రాలేదు. వ్యాపారులు భారీగా ముందుకొస్తారని ఎక్సైజ్ శాఖ అధికారులు భావించారు. బార్ల దరఖాస్తు స్వీకరణకు గడువు శుక్రవారంతో ముగిసింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 183 బార్లకు ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయగా, లెక్కలు ఇలా ఉన్నాయి.

కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లాలో ఓపెన్ కేటగిరీలో 39, గీత కార్మికులకు నాలుగు బార్లను కేటాయించారు. ఆ జిల్లాలో మొత్తం 43 బార్లను నోటిఫై చేశాడు. కృష్ణాజిల్లాలో 39 ఓపెన్ కేటగిరీ బారుల్లో 26 బార్లకు 112 మంది ధరావత్తు చెల్లించి దరఖాస్తులను అందజేశారు. నాలుగు రిజర్వేషన్ బార్లకు 39 దరఖాస్తులు అందాయి. రిజర్వేషన్ కేటగిరీ బార్లకు పూర్తిస్థాయిలో పోటాపోటీగా దరఖాస్తులు వచ్చాయి. ఓపెన్ కేటగిరీ బార్లకు మాత్రం ఈస్థాయిలో దరఖాస్తులు రాలేదు. రిజర్వేషన్ కేటగిరీలోని ఒక్కో బార్‌కు పది దరఖాస్తులు అందాయి. ఓపెన్ కేటగిరీలో ఎన్టీఆర్ జిల్లాలో 60, కృష్ణాజిల్లాలో 26 బార్లకే నాలుగేసి దరఖాస్తులు వచ్చాయి.



ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలోని 130 బార్లను ఓపెన్ కేటగిరీకి, పది బార్లను గీత కార్మికులకు కేటాయించారు. మొత్తం 140 బార్లను నోటిఫై చేశారు. 130 ఓపెన్ కేటగిరీలో ఉన్న బార్లకు మొత్తం 524 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 126 బార్లకు దరఖాస్తుదారులు ముందుకొచ్చారు. మొత్తం 60 బార్లకు 255 మంది రూ.5 లక్షల ధరావత్తు, రూ.10 వేల ఫీజు చెల్లించి దరఖాస్తులను మిగతా 6లో..

సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని శాసిస్తున్న ఈ రోజుల్లో ప్రజలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఈక్రమంలో పని ఒత్తిడితో ఆరోగ్య సమస్యలూ వారిని చుట్టుముడుతున్నాయి. ఎప్పుడు ఏ విపత్తు సంభవిస్తుందో తెలియని పరిస్థితి. ఆరోగ్యంగా ఉన్నవారిని సైతం మానసిక ఒత్తిడి తీవ్రంగా కుంగ దీస్తోంది. శారీరక శ్రమ లేకపోవడం.. ఆర్థిక పరిస్థితులు, మానసిక ఆందోళనతో హృదయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. చిన్న వయస్సులోనే హృద్రోగాలు, నరాల సంబంధిత కేసులు పెరుగుతున్నాయని ఇలాంటి పరిస్థితిల్లో ఎల్లప్పుడూ జాగరూకతతో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు.



బ్రెయిన్‌స్ట్రోక్ రోగులకు సంజీవని..
టెనెక్ట్‌ప్లాజా

- గోల్డెన్ అవర్‌లో వస్తే ఇంజక్షన్‌తో మూడు నాలుగు గంటల్లోనే సాధారణ స్థితికి
- రూ.40 వేల ఖరీదైన ఇంజక్షన్ జీజీహెచ్‌లో ఉచితం
- అధిక ఒత్తిడి, ఆలోచనలతో బ్రెయిన్‌స్ట్రోక్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

బ్రెయిన్‌స్ట్రోక్ బారినపడిన బాధితులను సమయానికి ఆసుపత్రికి తీసుకెళ్లగలిగితే వెంటనే తేరుకునే అవకాశాలు ఉన్నాయి. బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు టెనెక్ట్‌ప్లాజా ఇంజక్షన్ సంజీవని లాంటిది. బ్రెయిన్‌స్ట్రోక్ బారినపడిన బాధితులకు ఇంజక్షన్‌ను మూడు నుంచి నాలుగు గంటల్లోగా ఇస్తే రోగి త్వరగా కోలుకునే అవకాశముందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీని ధర మార్కెట్లో రూ.39 వేల నుంచి రూ.50 వేలు వరకు ఉంటుంది. అయితే ఇంత ఖరీదైన ఇంజక్షన్‌ను జీజీహెచ్‌లో ఉచితంగా అందిస్తున్నారు. నెలకు సగటున ఆరుగురికి ఉచితంగా ఇంజక్షన్ ఇవ్వడంతో ప్రాణాలు కాపాడుతున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్ లక్షణాలతో వచ్చిన బాధితులకు వెంటనే ఈ ఇంజక్షన్ ఇవ్వడం వలన వీలైనంత తొందరగా కోలుకుంటారని జీజీహెచ్‌లో ఉచితంగానే ఇంజక్షన్ ఇస్తారని వైద్యులు చెబుతున్నారు.

గోల్డెన్ అవర్ కీలకం..

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బాధితుడిని మూడు నుంచి నాలుగున్నర గంటల్లో ఆసుపత్రికి తీసుకురావాలి. సమయం చాలా కీలకం. గోల్డెన్ అవర్‌లో చేర్చిన రోగులకు మాత్రమే 'టెనెక్ట్‌ప్లాజా' ఇంజక్షన్ ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. సీటీ స్కాన్ పరీక్ష చేసి ఇంజక్షన్ అవసరమా.. లేదా అని వైద్యులు నిర్ధారిస్తారు. బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుల్లో ఎక్కువమందికి రక్తం గడ్డకడుతుంది. ఇలాంటి వారికి ఈ ఇంజక్షన్ ఇస్తే గడ్డకట్టిన రక్తాన్ని కరిగించడానికి ఉపయోగపడుతుంది. బ్రెయిన్‌లో బ్లీడింగ్ అయితే ఇంజక్షన్ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇంజక్షన్ ఇచ్చిన మూడు గంటల్లోనే రోగి సాధారణస్థితికి చేరుకునే అవకాశం ఉందని, సమయం దాటిపోయిన తరువాత ఇంజక్షన్ ఇచ్చినా ప్రయోజనంలేదని వైద్యులు పేర్కొంటున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలు

విపరీతంగా ఆలోచించడం, అధిక ఒత్తిడికి లోనుకావడమే బ్రెయిన్‌స్ట్రోక్‌కు కారణాలని వైద్యులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే బ్రెయిన్‌స్ట్రోక్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగింది. జీజీహెచ్‌కు రోజూ కనీసం ఒకటి నుంచి రెండు బ్రెయిన్‌స్ట్రోక్ కేసులు వస్తుంటాయి. సమయానికి రావడంతో నెలలో సగటున నాలుగు కేసులు ప్రాణాలతో బయటపడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుల్లో సమయానికి రాలేకపోయినవారే ఎక్కువ ఉన్నారు. అలాంటివారికి ఇంజక్షన్ ఇచ్చినా ఫలితంలేదని, బ్లీడింగ్ అయినవారికి ఈ ఇంజక్షన్ ఇవ్వకూడదని, రక్తం గడ్డకట్టినవారికి మాత్రమే న్యూరాలజీ విభాగంలో ఈ ఇంజక్షన్‌ను ఇస్తున్నట్టు న్యూరాలజీ వైద్యులు పేర్కొంటున్నారు.

లక్షణాలు

బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుల్లో చేతులు, కాళ్లు తిమ్మిర్లు ఎక్కడం, మూతి వంకరపోవడం, కాళ్లు, చేతులు తీవ్రమైన నీరసంగా ఉండడం, కొన్నిసార్లు ఫిట్స్ వచ్చినట్టు కొట్టుకోవడం, ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఈ స్థితిలో వెంటనే ఆసుపత్రిలో చేర్చాలి. లక్షణాలను బట్టి సీటీస్కాన్ చేసి నిర్ధారించిన తరువాతే ఇంజక్షన్ ఇస్తారు. న్యూరాలజీ విభాగంలో ఇంజక్షన్ ఇస్తారని, తరువాత ఫాలోఅప్ ట్రీట్‌మెంట్ అందిస్తామని వైద్యులు చెబుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచితంగానే టెనెక్ట్‌ప్లాజా ఇంజక్షన్ అందిస్తున్నాం

డాక్టర్ డీవీ మాధవికుమారి,
డాక్టర్ జి.బ్లెస్సీ



బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు జీజీహెచ్‌లో 2023 జూలై నుంచి ఉచితంగా ఇంజక్షన్ అందిస్తున్నామని డాక్టర్ డీవీ మాధవికుమారి, డాక్టర్ జి.బ్లెస్సీ తెలిపారు. ఇప్పటి వరకు గోల్డెన్ అవర్‌లో వచ్చిన బాధితులు ఇంజక్షన్ ద్వారా 57మంది కోలుకున్నారని, ప్రాణాపాయస్థితిలో, కనీసం సరిగా చూడలేని పరిస్థితుల్లో వచ్చిన ఎంతోమంది రోగులు మూడు, నాలుగు గంటల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటున్నారన్నారు. స్ట్రోక్ వచ్చిన వెంటనే ఆసుపత్రికి తీసుకురావడం కీలకమని గుర్తించాలని వారు చెబుతున్నారు.



పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో, అర్చకస్వాములు

ఇంద్రకీలాద్రిపై ముగిసిన వినాయకచవితి

వన్‌టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో వినాయకచవితి త్రయాహ్నిక దీక్షాపూర్వక గణపతి పూజలు శుక్రవారంతో ముగిశాయి. స్థానాచార్యుడు శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వైదిక కమిటీ చివరి రోజు పూజా కార్యక్రమాలను పూర్తిచేసి పూర్ణాహుతి నిర్వహించారు. ఈవో శీనానాయక్ పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు శాస్త్రోక్తంగా కృష్ణానదిలో గణపతిని నిమజ్జనం చేశారు.

వీఐపీలకూ సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్

దేవస్థానంలో నూతనంగా ప్రారంభించిన వీఐపీ సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్‌ను భక్తులు వినియోగించుకుంటున్నట్టు దేవస్థానం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోంగార్డులు, సెక్యూరిటీ, దేవస్థానం సిబ్బంది సూచన మేరకు వీఐపీలు తమ సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను డిపాజిట్ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. సిఫారసు లేఖలతో వచ్చే భక్తులు, వీఐపీలు తప్పనిసరిగా తమ సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులతో నేరుగా ఆలయంలోకి ప్రవేశించకుండా కౌంటర్‌లో డిపాజిట్ చేయాలని దేవస్థానం ప్రకటించింది.



దుర్గమ్మ భక్తులు.. సిబ్బందికి డ్రెస్ కోడ్

దుర్గమ్మను దర్శించుకునే భక్తులు, ఆలయ సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలని భక్తులు ఎలాంటి వస్త్రధారణతో ఆలయంలోకి రావాలో ఫోటోల రూపంలో ఆలయ పరిసరాల్లో బోర్డులను ఏర్పాటు చేశారు.



గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న విద్యాసాగర్ తదితరులు

చిరస్మరణీయుడు గిడుగు

- ఏపీఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రాంధిక భాషను సరళంగా, జనం వాడుక భాషగా తీర్చిదిద్దిన వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి తెలుగు వారందరికీ చిరస్మరణీయుడని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గిడుగు జయంతి కార్యక్రమాన్ని గ్రంథాయాధికారిణి కె.రమాదేవి నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యాసాగర్ గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేవాలయాల్లో వున్న శాసనాల లిపిని నేర్చుకొని ఎన్నో చారిత్రక అంశాల్ని వెలికి తీసిన భాషా పండితుడు గిడుగు అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ మాట్లాడుతూ, తెలుగు మాసపత్రికను స్థాపించి శాస్త్రీయ వ్యాసాలతో నడిపి, వీరేశలింగం, చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి వంటి ఉద్దండ కవుల్ని వ్యావహారిక భాషా ఉద్యమం వైపు నడిపించిన ప్రతికా భాషోద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త గిడుగు వెంకట రామ్మూర్తి అని అన్నారు. ఈ సందర్భంగా కనుమరుగవుతున్న అనుబంధాలను ఉమ్మడి కుటుంబాల్లో పునరుజ్జీవింపచేసే 19 కథలతో జ్యోతి మువ్వల రచించిన అరవింద కథల సంపుటిని అలపర్తి విద్యాసాగర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు చొప్పా రాఘవేంద్రరావు, ఏపీఎన్జీవో పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు డి.సత్యనారాయణ రెడ్డి గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగును కాపాడుకుందాం

- వక్తల పిలుపు

గాంధీనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదంలో పడిన తెలుగు భాషను భావితరాల కోసం కాపాడుకుందామని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. అలాగే ఘంటశాల పాటలను కాపాడుకోవాలన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. జాతీయ తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఊరురా జన విజ్ఞాన, ఆల్ ఇండియా ఘంటశాల చైతన్య వేదిక, తెలుగు కళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జేజేలు పలికారు. పద్మశ్రీ ఘంటశాల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య రాష్ట్రస్థాయి రెండో దశ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ, జాతీయ తెలుగు భాష దినోత్సవ ప్రాముఖ్యతను, వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత చరిత్రలోని ముఖ్య అంశాలను వివరించారు. కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, ఘంటశాల పాటలు తెలుగు భాషకు పట్టాభిషేకమన్నారు. ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలన్నారు. చింతకాయల చిట్టిబాబు, సింగంశెట్టి చంద్రశేఖర్, కళాభారతీ, ఆంజనేయరాజు, డేవిడ్‌రాజు, రామతీర్థ, రంగరాజు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు యూరియా!

- రైతు సేవాకేంద్రాల నుంచి తరలిపోతున్న డీఏపీ
- వ్యవసాయాధికారుల కాసుల కక్కుర్తి
- చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్

ఎ.కొండూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బస్తా యూరియా కోసం రైతన్నలు గంటలతరబడి దుకాణాల వద్ద పడిగాపులు పడుతుంటే.. కాసులకు కక్కుర్తిపడి కొందరు అధికారులు దళారుల ద్వారా డీఏపీని దారిమళ్లిస్తున్నారు. పంటలకు యూరియా సకాలంలో అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎ.కొండూరు మండలంలో మార్క్‌ఫెడ్ ద్వారా రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసిన యూరియా, డీఏపీలను ప్రయివేటు వ్యాపారులతో కుమ్మక్కై సొమ్ము చేసుకున్న ఘటన అలస్యంగా వెలుగుచూసింది. ఆగస్టు 8, 10 తేదిల్లో మార్క్‌ఫెడ్ నుంచి ఎ.కొండూరు ఆర్ఎస్‌కేకు 15టన్నుల యూరియా, ఐదు టన్నుల డీఏపీ, చీమలపాడుకు 14.9 టన్నుల యూరియా సరఫరా చేసింది. అయితే కొందరు అధికారులు ప్రయివేటు వ్యాపారులతో కుమ్మక్కై యూరియా, డీఏపీని గుట్టుచప్పుడు కాకుండా దొడ్డిదారిన బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. చీమలపాడు పరిధిలో కృష్ణారావుపాలెం, రామచంద్రాపురం గ్రామాలు, పలు గిరిజనతండాలు, ఎ.కొండూరు పరిధిలో ఎ.కొండూరుతండా, చైతన్యనగర్, మాత్రియాతండాలో వందలాది ఎకరాలల్లో పత్తి, వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగవుతున్నాయి. నిబంధనల ప్రకారం యూరియా బస్తా 266 ధర ఉండాగా, బ్లాక్ మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు. డీఏపీ రూ. 1350 ఉండగా.. రూ.1450 వరకు విక్రయిస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. రైతు సేవాకేంద్రాలకు వచ్చిన యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఏవో బండి సాయిశ్రీని వివరణ కోరగా.. యూరియా తరలింపుపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విచారణ చేపట్టాలి : టీడీపీ నేతలు

ఎ.కొండూరు, చీమలపాడు రైతు సేవాకేంద్రాల ద్వారా సరఫరా చేసిన యూరియాను పక్కదారి పట్టించిన అధికారులపై సమగ్రవిచారణ చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు బరోతు పీక్లా నాయక్, చీమలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు బెజవాడ శంకర్, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి బాణావతు బీమ్లా నాయక్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు చేరాల్సిన యూరియా, డీఏపీని కాసులకు కక్కుర్తిపడి కొందరు అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎ.కొండూరులో 15 టన్నుల యూరియా, ఐదు టన్నుల డీఏపీ, చీమలపాడులో 14.9 టన్నుల యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

యూరియా కొరతపై ఆందోళన వద్దు

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

పామర్రు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, రైతుల అవసరం మేరకు సమృద్ధిగా అందుబాటులో ఉంచడం జరుగుతుందని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కురుమద్దాలిలో ఆక్వా పరిశ్రమను సందర్శించి ఎగుమతులు, దిగుమతులు గురించి సిబ్బందిని అరాతీశారు. అనంతరం కలెక్టర్‌ను ప్రధాన గేటు వద్ద కనుమూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు అడ్డుకుని తమ సొసైటీలో అవసరమైన యూరియా, కాంప్లెక్స్ అందడంలేదని, వచ్చిన నిల్వను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తాయన్నారు. సెప్టెంబరు 2న గుజరాత్ నుంచి అవసరమైన యూరియా, కాంప్లెక్ ఎరువులు దిగుమతి జరుగుతుందన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రస్తుతకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలుతీసుకోవాలని సూచించారు. త్వరితగతిన నూతన భవనాల నిర్మాణానికి తన వంతు కృషిచేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యుడు పి.సుదేష్‌బాబు, తహసీల్దార్ జి.రవికాంత్, సీఐ సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.



యూరియా కొరతపై కలెక్టర్‌కు మొర పెట్టుకుంటున్న కనుమూరు గ్రామ రైతులు

వివాహిత ఆత్మహత్యాయత్నం

తాడేపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాల నేపథ్యంలో వివాహిత కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్యయత్నం సంఘటన పట్టణ పరిధిలోని సీతానగరంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ భవానీపురానికి చెందిన దాసరి యామినికి అదే ప్రాంతానికి చెందిన నరేంద్రతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. భర్త తాగి వచ్చి గొడవలు పడుతుండటంతో గత ఆర్నెల్లుగా పుట్టింటిలో ఉంటోంది. తిరిగి భర్త వద్దకు వెళ్లగా నిరాకరించడంతో మనస్తాపం చెందినట్టు బాధితురాలు పోలీసులకు తెలిపింది. సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద కృష్ణానదిలో మునిగిపోతున్న యామినిని స్థానిక మత్స్యకారులు కాపాడి పోలీసులకు అప్పగించారు. తాడేపల్లి ట్రైనీ ఉమన్ ఎస్ఐ అపర్ణ బాధితురాలికి కౌన్సెలింగ్ ఇచ్చి తండ్రి శ్రీనివాసరావుకు అప్పగించారు.

ఫ్యామిలీ కార్డుతో మేలు

- లంకా దినకర్

అమరావతి: 'అర్హత కలిగిన లబ్ధిదారులకు కుటుంబకార్డు వ్యవస్థతో మంచి జరుగుతుంది. ఈ విధానంతో అర్హులైన ప్రతిపేదవానికి ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టకుండా ఉపయోగపడతాయి' అని 20 సూత్రాల అమలు చైర్మన్ లంకాదినకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబం మొత్తాన్ని ఒక యూనిట్‌గా పరిగణించకుండా కుటుంబంలోని అర్హత కలిగిన ప్రతి వ్యక్తికీ సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా ఉమ్మడి కుటుంబాలను పోత్సహిస్తున్నారు. ఇది మంచి పరిణామం అని పేర్కొన్నారు.

రైతు బాగుంటేనే.. రాజ్యం

- నియోజకవర్గంలో అన్నదాతకు పెట్టుబడి సాయం రూ.20.19కోట్లు
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

గొల్లపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతు రాజు.. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం వర్తింపునకు కృతజ్ఞతగా శుక్రవారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు రైతు సోదరులు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల ఐక్యతకు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించినట్టు పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో సుమారు 30 వేలమంది అన్నదాతలకు రూ.20.19 కోట్లు పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల బ్యాంక్ ఖాతాలలో పెట్టుబడి సాయాన్ని జమ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ కింద మైలవరం నియోజకవర్గంలో రూ.15.12 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని, సుమారు 30.241 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. రైతు సోదరుల తరఫున ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఆర్డీఏ అధికారులు

రాజధానిలో ప్లాట్లు పొందిన రైతులకు సర్టిఫికెట్లు

విజయవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక గ్రామ రైతులకు ఈ-లాటరీ విధానంలో 75 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. లాటరీ కార్యక్రమం శుక్రవారం నగరంలోని సీఆర్డీఏ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎఫ్ఏసీ) వి.డేవిడ్‌రాజు, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీఎస్‌బీ వసంతరాయుడు, పెనుమాక డిప్యూటీ కలెక్టర్ ఎ.జి.చిన్నికృష్ణ, ఐటీ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.శివశంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 75 ప్లాట్లలో 45 నివాసానికి కాగా 30 వాణిజ్య ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. 33 మంది రైతులు, భూయజమానులకు ఆన్‌లైన్ విధానంలో ప్లాట్లను కేటాయించారు. ఈ-లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్ వేసిన తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రకియ నిర్వహించారు. ప్లాట్లు పొందిన రైతులకు ఎక్కడ కేటాయించాలో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించినట్టు డేవిడ్‌రాజు తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

ఖిల్లాపై అల్లరల్లరి

(5వ పేజీ తరువాయి)

జరిగాయి. కోటపైకి వెళ్లకుండా పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లడం, పాడుపనులకు పాల్పడుతుండటంతో ఇటీవల ఖిల్లాపైకి వెళ్లే ఎంట్రన్స్‌లో ఒక పోలీస్‌ను పెట్టారు. దీంతో జంటల తాకిడి కాస్త కట్టడి అయ్యింది. కాగా, పర్యాటకులు నిరంతరం రాకపోకలు సాగించే ఖిల్లాపై సీసీకెమెరాలు పనిచేయకపోవడంతో యువత మరింత రెచ్చిపోతోంది.

సీఎం బందోబస్తులో ఉన్నాం

- ఎ.చంద్రశేఖర్, ఇబ్రహీంపట్నం పీఎస్ సీఐ

వినాయకచవితి రోజు సీఎం చంద్రబాబు దూండీ వినాయకుడి దర్శనం కోసం వస్తుండగా మేమంతా బందోబస్తుకు వెళ్లాం. యువకుల అల్లరి నా దృష్టికి వచ్చింది. విచారణ చేస్తున్నాం. ఎవరనేది తెలుసుకుంటున్నాం. బందోబస్తు పటిష్టం చేస్తాం. ఇలాంటి ఘటనలు మరోమారు పునరావృత్తం కానివ్వం.

ఓపెన్ డల్.. రిజర్వేషన్ ఫుల్

(5వ పేజీ తరువాయి)

ఆన్‌లైన్‌లో సమర్పించారు. గీత కార్మికులకు కేటాయించిన పది బార్లకు 104 దరఖాస్తులు వచ్చాయి.

నేడు లాటరీ

నాలుగేసి దరఖాస్తులు వచ్చిన బార్లకు ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో శనివారం లాటరీ తీస్తారు. డ్రా ద్వారా ఎంపికైన దరఖాస్తుదారుడికి లైసెన్స్ జారీ చేస్తారు. ఎన్టీఆర్ జిల్లాలోని బార్ల లాటరీని విజయవాడ ఎంజీ రోడ్డులోని కలెక్టర్ కార్యాలయంలో, కృష్ణా జిల్లాకు సంబంధించిన బార్ల లాటరీని మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో తీస్తారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది.

సర్వే కష్టాలు

(5వ పేజీ తరువాయి)

వీఆర్వో, సర్వేయర్లు అందుబాటులోకి రావట్లేదని అంటున్నారు.

వీఆర్వో, సర్వేయర్లు ఎక్కడ?

పంచాయతీల్లోని ఇళ్లు కొన్ని పట్టా భూముల్లో ఉండగా, అధికశాతం గ్రామకంఠం భూముల్లోనే ఉన్నాయి. గ్రామకంఠం భూములు ప్రభుత్వానికి సంబంధించినవి కావడం, అందులో ఇళ్లు ఉండటం జరుగుతోంది. ఇంటి యజమానుల వద్ద సరైన పత్రాలు, ఎలాంటి ఆధారాలు కూడా ఉండవు. ఈ భూములను సర్వే చేయాలంటే గ్రామ వీఆర్వో, సర్వేయర్ కచ్చితంగా క్షేత్రస్థాయికి వెళ్లాలి. ప్రస్తుతం సర్వేయర్లు, వీఆర్వోలు.. తమకు ప్రభుత్వం ఈ-క్రాప్‌తో పాటు నూతనంగా ఏర్పాటుచేసిన కాలనీల్లో ఇంటి స్థలాలకు సంబంధించి అర్హుల గుర్తింపు, ఇతర పనులు అప్పగించిందని, తాము స్వామిత్వ సర్వేకు రాలేమని చెబుతున్నారు. పంచాయతీల్లోని ఇళ్లకు సంబంధించిన కొలతలు తీసుకోవడం ఒక ఎత్తయితే, ఈ వివరాలు స్వామిత్వ పోర్టల్‌లో నమోదు చేయడానికి చాలా సమయం పడుతోందని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. గతంలో నలుగురైదుగురు సిబ్బంది యంత్రాల సాయంతో సర్వేచేస్తే రోజుకు 25కు మించి ఇళ్ల సర్వే పూర్తిచేయడానికి సమయం సరిపోలేదని, వందలాది ఇళ్లు ఉన్న పంచాయతీల్లో స్వామిత్వ సర్వేను ఈ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించే అంశంపై కలెక్టర్ దృష్టిసారించి తగిన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

చిన్న కాంట్రాక్టర్లకు టెండర్ పెట్టారు..!

(5వ పేజీ తరువాయి)

చిన్న కాంట్రాక్టర్లు విమర్శిస్తున్నారు. రామవరప్పాడులోని బల్లెంవారి వీధి నుంచి నిడమానూరు రోడ్డు జంక్షన్ వరకు, బల్లెంవారి వీధి నుంచి మహానాడు రోడ్డు వరకు, మహానాడు రోడ్డు నుంచి బందరు రోడ్డు వరకు మూడు వేర్వేరు రోడ్ల పనులకు రూ.75.04 కోట్లతో సీఆర్‌డీఏ కిందటి నెలలో టెండర్లు పిలిచింది. ఈనెల 11 నాటికి టెక్నికల్ బిడ్లు తెరవాల్సి ఉండగా, ఈనెల 19కి, ఆ తర్వాత 29కి వాయిదా వేశారు. కానీ, ఆ రోజు టెక్నికల్ బిడ్లను తెరవకుండా టెండర్లను రద్దు చేస్తున్నట్టు కాంట్రాక్టు సంస్థలకు మెయిల్ చేశారు. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌పై టెండర్లు రద్దు చేసే అధికారం సీఆర్‌డీఏకు ఉంటుంది. కానీ, ఎందుకు రద్దు చేశారన్న కారణాన్ని కచ్చితంగా కాంట్రాక్టు సంస్థలకు చెప్పాలి. ఆ పని మాత్రం చేయలేదు. పథకం ప్రకారం ఓ చీఫ్ ఇంజనీర్ (సీఈ) ఈ కథ నడిపించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

అన్నీ అర్హత కలిగినే సంస్థలే..

ఈ టెండర్లలో అన్నీ అర్హత కలిగిన సంస్థలే పాలు పంచుకున్నాయి. ప్రధానంగా హాట్ మిక్సింగ్ ప్లాంట్ కలిగి ఉన్నవారు అర్హులు. టెండర్లలో పాలు పంచుకున్న ప్రతి సంస్థ హాట్ మిక్సింగ్ ప్లాంట్‌ను కలిగి ఉంది. కాబట్టి ముందుగా టెక్నికల్ బిడ్లను, ఆ తర్వాత ఫైనాన్షియల్ బిడ్లను తెరిస్తే సరిపోతుంది. కానీ, సీఆర్‌డీఏ అధికారులు ఆ పని చేయలేదు. విజయవాడ, గుంటూరు శివారు రోడ్ల విస్తరణకు సంబంధించి నాలుగు ప్యాకేజీ పనులను గంపగుత్తగా పెద్ద కాంట్రాక్టర్‌కు కట్టబెట్టే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది.

టెండర్ల రద్దుతో ఇబ్బందులు

టెండర్లను రద్దుచేస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. బల్లెంవారి వీధి-నిడమానూరు జంక్షన్, బల్లెంవారి వీధి-మహానాడు రోడ్డు, మహానాడు రోడ్డు - బందరు రోడ్డుకు మూడు వేర్వేరు టెండర్లు పిలిచారు. ఇప్పుడు ఈ టెండర్లన్నింటినీ ఒకటిగా కలిపితే సాంకేతిక, పరిపాలనాపరమైన అనుమతులు తీసుకోవాలి.

తప్పించుకునే ధోరణి

సీఆర్‌డీఏ అధికారులపై విమర్శలు వస్తుండటంతో తప్పించుకోవటానికి భూ సేకరణ సమస్యలున్నాయన్న వాదనలను తెరపైకి తీసుకురావాలని భావిస్తున్నారు. భూ సేకరణ సమస్య ఉంటే టెండర్లు పిలవకూడదు. ఈ కారణం చెబితే సమస్య ఉండదని, బల్క్‌గా టెండర్లు పిలవొచ్చన్నది అధికారుల ఆలోచన.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 112, 121, 132
చికెన్ విత్ స్కిన్ 214
చికెన్ స్కిన్‌లెస్ 224
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

వీఎన్ పురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలి: సీపీఎం

గన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి శివారు వీఎన్‌పురం కాలనీలో తాగునీటి సమస్య పరిష్కా రానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం వీఎన్ పురంలో సీపీఎం నాయకులు పర్యటించారు. వారం రోజులుగా గ్రామస్తులు మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు మహిళలు చెప్పారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం తవ్విన గోతుల వల్ల తాగునీటి పైపులైన్లు పగిలిపోయాయని, వాటికి వెంటనే మర మ్మతులు చేయని కారణంగా తాగునీరు అందక అవస్థలు పడు తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యతో జనాలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం సరికాదన్నారు. సూరగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరరావు, ఉడతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వెలుగు గిడుగు

ఘనంగా మాతృభాష, జాతీయ క్రీడా దినోత్సవం

ప్రసాదంపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో తెలుగు మాతృ భాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రార్థన గీతం ఆలపించి, జ్యోతి వెలిగించారు. విద్యార్థులు కవుల వేషధార ణలను ధరించి చక్కటి తెలుగు పద్యాలను ఆలపిం చారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథి డాక్టర్ జీవీ పూర్ణచంద్ మాతృభాష విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పరిమి పవన్ చంద్, కడియాల ప్రవీణ్ కుమార్, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానూరు: కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడె న్సియల్ స్కూల్లో శుక్రవారం తెలుగుభాషా దినోత్స వం, క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరి గాయి. భాషా పరిశోధకులు డాక్టర్ జీవీ పూర్ణచంద్ ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు ప్రాముఖ్యతను వివరించా రు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ గిడుగు రామూర్తి గొప్పతనాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానూరు అశోక్ జిమ్ ఆధ్వర్యంలో హాకీ క్రీడా మంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సంద ర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగుభాషా పితామహుడు గిడుగు రామూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిమ్ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్, సీపీవో నాగేశ్వరరావు, షాజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : తెలుగు భాష చక్కదనాన్ని చాటి చెప్పిన చిచ్చరపిడుగు గిడుగు రామమూర్తి అని ఆంధ్రోపన్యాసకుడు వలివీటి వెంకట శివరామకృష్ణ మూర్తి అన్నారు. తెలుగుభాష దినోత్సం పురస్కరిం చుకుని ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల తెలుగు శాఖ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ మాట్లాడుతూ, గిడుగు రామమూర్తికి చిన్నప్పటినుంచి విద్యాసక్తి, కార్య దీకక్ష, సత్యాన్వేషణం ప్రధాన లక్షణాలని, అంటరానితనాన్ని వ్యతిరేకించిన మహనీయుడు అన్నారు. ప్రత్యేక అధికారి సత్యనా రాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ విన య్‌కుమార్, తెలుగు శాఖాధిపతి ఎంఎల్‌ఎస్ కుమారి, అన్వర్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషి నేటికి శిరోధార్యమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబో యిన కోటేశ్వరరావు అన్నారు. తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయం తి వేడుకను శుక్రవారం స్థానిక మానవత కార్యా లయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాన వత నిర్వాహకులు జేవీవీ సత్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, వీవీ చలం, గంటా సత్యనారాయణ, ఇందిరాదేవి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: తెలుగు భాషను సరళీకరించి అందుబాటులోకి తెచ్చిన మహోన్న త వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని హెచ్‌ఎం నిర్మల విద్యార్థులకు వివరించారు. వీరవల్లి హైస్కూల్‌లో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రమణ గోపాల్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు.. ఉయ్యూరులో ఏజీఎస్‌లో మాట్లాడుతున్న వెంకట శివరామకృష్ణ.. వీరవల్లి హైస్కూల్‌లో



సిద్ధార్థ వర్సిటీలో జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీ

డీజేల శబ్దాలతో వికృతానందం సరికాదు : సీఐ

ఉయ్యూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఉత్సవాల్లో డీజేల ముందు డాన్సులు చేస్తూ వికృతా నందం పొందడం సరికాదని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలి పారు. విపరీతమైన డీజే బాక్స్‌ల శబ్దాల వలన బాలింత లు, గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు తీవ్ర అసౌకర్యా నికి గురవుతారని పేర్కొన్నారు. యువత ఇలాంటి వాటికి దూరంగా ఉంటూ మంచి లక్ష్యాలు పెట్టుకుని కష్టపడి దాని వల్ల వచ్చే విజయంతో ఎక్కువ శబ్దం చేయాలని సూచించారు.

పాము కాటుతో ఒకరి మృతి

పెనమలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన పెనమ లూరు పోలీసుస్టేషను పరిధిలోని పెదపులిపాక గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు...పె దపులిపాకకు చెందిన అమలాపురపు దుర్గా రావు(57) తాపి పనులకు వెళుతుంటాడు. ఈనెల 26న తన ఇంటి ముందున్న రాళ్లు సరిచేస్తుండగా రాళ్ల కింద ఉన్న పాము అతని ఎడమచేతి మధ్య వేలుపై కాటు వేసింది. దీంతో వెంటనే కుటుంబ స భ్యులు దుర్గారావును పెనమలూరు పీహెచ్‌సీకి తరలించారు. మరింత మెరుగైన వైద్యం కోసం విజ యవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం దుర్గారావు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



హెచ్‌ఎం ఝాన్సీ రాణి, పీడీ కృష్ణప్రియలను సత్కరిస్తున్న డీఈవో రామారావు

బాలికల హైస్కూల్‌కు అవార్డు

గన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలికల ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ ఎక్సలె న్సీవ్ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం స్పోర్ట్స్‌డే పురస్కారించుకుని డీఈవో పీజేవి రామా రావు చేతుల మీదుగా హెచ్‌ఎం ఝాన్సీ రాణి, పీడీ కృష్ణ ప్రియలు అవార్డు అందుకున్నారు. పాఠశాల జిల్లాలో 4వ స్థానంలో ఉందని అవార్డు అందుకో వటం గర్వంగా ఉందని హెచ్‌ఎం ఝాన్సీ రాణి అన్నారు. పీడీలు కొమ్మినేని గీతా, కె.టాన్యా గిరిలను ఉపాధ్యాయులు అభినందించారు.



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న సిద్ధార్థ వర్సిటీ వీసీ వెంకటేశ్వరరావు

పరిశ్రమల్లో మెటల్ యాడిటివ్ తయారీ, వినియోగంపై వర్క్‌షాప్

కానూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో మెకా నికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పరి శ్రమల్లో మెటల్ యాడిటివ్ తయారీ, వినియోగంపై రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమయింది. ఈ వర్క్‌షాప్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు ప్రారంభిం చారు. ఐఐటీ హైదరాబాద్ ప్రతినిధి డాక్టర్ ఎం. గోపీనాథ్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని మాట్లాడుతూ, ఆధునిక ఇంజనీరింగ్ రంగంలో యాడిటివ్ తయా రీకి పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రొ. వీసీ ఏవీ రత్నప్ర సాద్, డీన్ వెంకట్రావు, డాక్టర్ జి. దిల్లీబాబు తో పాటు పలువురు ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పెనమలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కానూరుకు చెందిన జడ మదన్‌కు వైద్యఖర్చుల నిమిత్తం శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రూ. 5లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియో జకవర్గంలో ఎవ్వరూ అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ వైద్య ఖర్చుల కోసం ఎదురు చూసే పరిస్థితి ఉంటే ముఖ్యమంత్రి సహాయనిధి కింద సహాయం అందించేందుకు తాను ముందుంటానని హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి నాయ కులు కుర్రా నరేంద్ర, సంగెపు రంగారావు, యాళ్ల చక్రవర్తి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమలశాఖ ఏడీ ప్రదీప్‌కుమార్

ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేసే లక్ష్యంతో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందని జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ పి.ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం బాపులపాడు మండల పరిషత్ కార్యా లయంలో జిల్లా పరిశ్రమల శాఖ సర్వే ద్వారా గుర్తించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంఎస్‌ఎంఈపై అవగాహన కల్పించారు. 225 మందిని ఉద్యంలో రిజిస్ట్రేషన్ చేశారు. ఏరియా పారిశ్రామికాభివృద్ధి అధికారి మనోజ్ రాంప్, ఎంపీపీ వై.నగేష్, ఈవోపీఆర్డీ లక్ష్మయ్య, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎనికేపాడు తాతాపురం కాలనీలో గణపతికి ప్రత్యేక పూజలు

గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వ రరావు అన్నారు. దంటగుంట్లలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి సర్పంచ్ యజ్జవరపు వెంకటరంగారావు, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో శుక్ర వారం నిర్వహించిన ప్రత్యేక పూజలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్నంగి శేషగిరిరావు, కొమ్మారెడ్డి రాజేష్, యజ్జవరపు శ్రీనివాసరావు, దన్నే దుర్గారావు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన చవితి పం దిళ్లలోని ఘననాథుడిని కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) సందర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంకిపాడులో జనసేన పార్టీ అధ్యక్షులు బోయిన నాగరాజు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సందర్శించారు. అనంతరం విష్ణాలయం, లాకు రోడ్డు, వైకుంఠపురంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆయన సందర్శించారు. స్థానిక టీడీపీ నాయకులు కొప్పరాజు సురేష్, ఏనుగ పవన్, విజయ్, పవన్ పాల్గొన్నారు.

ప్రసాదంపాడు : ఎనికేపాడు తాతాపురం కాలనీలో జైబాల గణపతి ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి వినాయకచవితి సందర్భంగా ఘనం గా పూజలు నిర్వహించారు. నాలుగేళ్లుగా ఈ కార్యక్రమాన్ని కాలనీ వాసులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. 5వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, సుమారు 300 మందికి అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం స్వామి వారి లడ్డూ వేలం పాట నిర్వహించారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకల దాడి

మంగళాపురంలో బ్యానర్ వివాదం.. కేసు నమోదు

విజయవాడ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మంగళాపురంలో వినా యక చవితి బ్యానర్ విషయమై వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళాపురంలో చవితి పందిరి ఏర్పాటు చేసుకుని, పందిరి వద్ద రాజకీ య ప్రస్తావన ఉండకూడదని తీర్మానం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రా మానికి చెందిన గాలి దుర్గా అనిల్ అనే టీడీపీ కార్యకర్త బుధవారం రాత్రి సీఎం చంద్ర బాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుల ఫొటోలతో కూడిన బ్యానర్‌ను ఏర్పాటు చేశాడు. దీంతో అక్కడకు చేరుకున్న వైసీపీ కార్యకర్తలు భరత్, గౌతమ్, సతీష్, సురేష్‌లు బ్యానర్ తీసివేయాలని అనిల్‌తో ఘర్షణకు దిగి దాడికి పాల్పడ్డారు. అడ్డుకున్న మరో టీడీపీ కార్యకర్త పలగాని శ్రీనుపై కూడా దాడి చేశారు. అనిల్ ఫిర్యాదు మేరకు నున్న రూరల్ పోలీసులు గురువారం రాత్రి వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేశారు.



హరికృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు టీం తారక్ ట్రస్ట్ కృషి



హెల్మెట్లు అందజేసిన ఏడీసీపీ ప్రసన్నకుమార్, టీం తారక్ ట్రస్ట్ సభ్యులు

ప్రసాదంపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమా దాల నియంత్రణకు టీం తారక్ ట్రస్ట్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీ యమని ఏడీసీపీ ప్రసన్న కుమార్ తెలిపారు. శుక్రవారం రామ వరప్పాడు రింగ్ సమీపం లో మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా టీం తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత ప్రమాద అవగాహన డ్రైవ్‌ను నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను ఏడీసీపీ ప్రసన్నకుమార్ పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు యార్లగడ్డ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ ఆలోచనలు ఆశయాలు ఆదర్శంగా తీసుకొని రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సుమారు 50 మందికి ఉచితంగా హెల్మెట్లు అందించినట్లు తెలిపారు. యార్లగడ్డ శ్యామ్, చిన్ను అవిర్నేని, అన్నే సాయి కృష్ణ కిషోర్, యార్లగడ్డ కార్తీక్, యార్లగడ్డ రామనారాయణ, జీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి నందమూరి హరికృష్ణ కృషి మరువలేనిది

కంకిపాడు : టీడీపీ బలోపేతానికి నందమూరి హరికృష్ణ చేసిన కృషి మరు వలే నిదని ఆ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. నందమూరి హరికృష్ణ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, చిట్టూరి నాగేశ్వరరావు, గుడిసేవ నాంచారయ్య, వణుకూరు విక్రం, వీరంకి శ్యామ్, అన్నే రామారావు, సత్తిబాబు, వడ్డాది శ్రీను, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందజేస్తున్న డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు

వైద్యవిధానంపై నిరంతరం అధ్యయనం అవసరం

గన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న ఆధునిక సాంకేతిక వైద్యవిధానంపై నిరంతరం అధ్యయనం చేయాలని కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ విభాగం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హిమో విజిలెన్స్ వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మా ట్లాడుతూ, రక్తమార్పిడిలో వచ్చే ఆధునిక సాంకేతికతను అంది పుచ్చుకో వాల న్నారు. ప్రతికూల చర్యలు, సమస్యలపై సమాచారం సేకరించాలన్నారు. బ్లడ్ సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ, వర్క్‌షాప్‌లను వైద్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్‌ఐబి హెచ్‌వోడీ ఆకాంక్ష బిస్టు, అనిల్‌కుమార్, డాక్టర్ సీవీరావు, డాక్టర్ భీమేశ్వర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆశాజ్యోతి దివ్యాంగులకు ఆటల పోటీలు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆటలు దివ్యాంగులకు ఉల్లాసాన్ని కలిగించేందుకు దోహదపడతాయని స్థానిక ఆశాజ్యోతి దివ్యాంగ ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకుడు మరీదు వెంకటస్వామి అన్నారు. జాతీయ క్రీడా దినోత్స వం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. మాధవీలత పర్యవేక్షించారు.



దొడ్డదేవరపాడు వంతెనపై మూడు అడుగుల ఎత్తున ప్రవహిస్తున్న కట్లేరు

ప్రమాద స్థాయి దాటి కట్లేరు ప్రవాహం

వీరులపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కట్లేరు ప్రమాద స్థాయి దాటి ప్రవహిస్తోంది. వీరులపాడు నుంచి కూడలి, చిలుకూరు, దొడ్డదేవరపాడు మార్గాల్లో మూడు రోజుల నుంచి రాకపోకలు నిలిచి పోయాయి. వందలాది ఎకరాల పంటలు నీటమునిగాయి. భారీ వర్షాలతో కట్లేరు ఉగ్రరూపం దాల్చింది. దొడ్డదేవరపాడు వంతెనపై పది అడుగుల ఎత్తున పొంగిన కట్లేరు వరద కొద్దిగా తగ్గింది. శుక్రవారం సాయంత్రానికి మూడు అడుగుల ఎత్తున వరద ప్రవహిస్తున్నది. చిలుకూరు వంతెన మీద వరద నీరు పారుతోంది. ఈ రెండు రూట్లలో వాహనాల రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. కూడలి రూటులో కొద్ది రోజులుగా వాహనాలు నడవటం లేదు. కట్లేరు వరద విరుచుకుపడటంతో జయంతి, దొడ్డదేవరపాడు, వీరులపాడు, పల్లెంపల్లి గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల్లో మాగాణి వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు ముంపునకు గురయ్యాయి. మూడు రోజుల నుంచి పంటలు నీటిలో నానుతున్నాయి. పంటలు నిలువునా దెబ్బతినటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



నీటమునిగిన పొలాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

ప్రభుత్వం దృష్టికి పంట నష్టం వివరాలు

గంపలగూడెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వరి, పత్తి, పెసర, మినుము, మిర్చి పంటలు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. పెనుగొలనులో దెబ్బతిన్న పత్తిపంట, అమ్మిరెడ్డిగూడెంలో మొగుళ్లవాగు ఆయకట్టులో నీట మునిగిని వరి పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. వర్షాల మూలంగా మొగుళ్లవాగు పరిధిలో పంటభూములు నీటి మునిగి, మూడుసార్లు వరి నాట్లు వెయ్యాల్సి వచ్చిందన్నారు. పంటల పరిస్థితిని ఇన్‌చార్జి మంత్రి సత్యకూమార్ దృష్టికి తీసుకువెళ్లి, పరిశీలించాలని కోరినట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటల వివరాలు ఇప్పటికే కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు రేగళ్ల వీరారెడ్డి, యనమద్ది పుల్లయ్యచౌదరి, దిరిశాల వెంకటకృష్ణారావు, వేముల బాలయ్య, బురుగు నారాయణ, కానూరు హనుమంతరావు, కోట వెంకట్, బజ్జూరి నరసింహారావు, తోట సత్యనారాయణ పాల్గొన్నారు.



పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద నీటి ప్రవాహం

దివిసీమలో వరద తగ్గుముఖం

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలవుతున్న వరద నీటి కారణంగా పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద 15.8 అడుగులు వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. నిన్నటి వరకు ఆందోళన చెందిన కృష్ణానది తీర ప్రాంత గ్రామాల ప్రజలు వరద తగ్గుముఖం పట్టడంతో కొద్ది మేర ఊపిరి పీల్చుకున్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందిస్తున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్

సీఆర్‌డీఏ జాబ్‌మేళాలో 91 మందికి ఉద్యోగాలు

కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సౌజన్యం తో తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో శుక్రవారం జాబ్‌మేళా జరిగింది. ఈ మేళాలో సెన్స్ సెమికండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవే ట్ లిమిటెడ్, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంతోష్ ఆటో మో టార్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీతారామ ఆటో మోటివ్స్ క్వెస్ కార్ప్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. జాబ్‌మేళాకు 301 మంది అభ్యర్థులు హాజరుకాగా, 91 మందికి ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులతో కలిసి సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆఫర్ లెటర్లు అందజేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి, సీఆర్‌డీఏ డీసీడీవో బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. సీఆర్‌డీఏ సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్‌లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్, నరసింహం, వెంకటేశ్వర్లు జాబ్‌మేళాను సమర్థవంతంగా నిర్వహించారు.

టీటీడీలో లడ్డూ ప్రసాదాల తయారీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై పోరాటం

● ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక నేత రామారావు



గవర్నర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదాల తయారీ విభాగం కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామని ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక పేర్కొంది. ఏలూరు రోడ్డులోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేదిక జాతీయ అధ్యక్షుడు వి.వి.రామారావు విలేకరులతో మాట్లాడారు. లడ్డు ప్రసాదాల తయారీ విభాగంలోని తాత్కాలిక ఉద్యోగుల సమస్యలపై చేపట్టను న్న ఆందోళన కార్యక్రమాలను వివరించారు. గత 25 సంవత్సరా లుగా లడ్డూ తయారీ విభాగంలో పని చేసే కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయకపోవడం వల్ల ఇతర ఉద్యోగులతో సమానంగాప్రయోజనాలు అందడం లేదన్నారు. అనారోగ్యం పాలైనా పట్టించుకోలేని దారుణ పరిస్థితుల్లో కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ పేద బ్రాహ్మణుల విషయంలో చొరవ చూపకుండా చిన్నచూపు చూస్తోందన్నారు. వేదిక ఆధ్వర్యంలో టీటీడీలోని పేద బ్రాహ్మణుల సమస్యలపై ఆందోళనా కార్యక్రమాలు చేపడుతు న్నామన్నారు. సెప్టెంబరు 6న 146 నదీ జలాలతో అమెరికా, కెనడా, యుకె, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లోనూ, సెప్టెంబరు 14న విజయవాడలోని సత్యనారాయణపురంలో మహారుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రుద్రాభిషేకం అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు డిప్యూ టీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. వేదిక వ్యవస్థాపకుడు బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, వేదికపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, తెలుగుమహిళా నేతలు

మహిళలకు ఆర్థిక తోడ్పాటే లక్ష్యం

● సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమంలో మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సూపర్‌సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతమైన సందర్భంగా శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో మహిళలతో ఆత్మీయ సమావేశం జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మహిళల్లో చైతన్యం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పద్మావతి విశ్వవిద్యాలయం ఏర్పాటు, మహిళలకు రిజర్వేషన్, ఆస్తి హక్కులను కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తున్నామని, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంత మంది పిల్లలకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. చిన్న చిన్న పనులు చేసుకునే మహిళలు ఉచిత బస్సు సౌకర్యం ద్వారా రూ.1500 నుంచి రూ. 2 వేల వరకు ఆదా పొందుతున్నారన్నారు. మచిలీపట్నం - విజయవాడకు ఆరు వరుసల జాతీయ రహదారిని నిర్మించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడామని, ఇందుకు రూ. 2600 కోట్లు మంజూరయ్యాయన్నారు. మచిలీపట్నం - రేపల్లె 45 కి.మీ రైల్వేలైను పొడిగింపు కార్యక్రమానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చిందన్నారు. ఈ రైల్వే లైను కోసం పోరాడిన కొక్కిలిగడ్డ కోదండరామయ్య మృతిచెందడం బాధాకరమన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 10,500 బస్సులు ఉండగా, అందులో 75 శాతం 8500 బస్సులను మహిళల ఉచిత బస్సు పథకానికి కేటాయించామన్నారు. రోజుకు ఆర్టీసీకి రూ. 7.5 కోట్ల నష్టం వస్తోందన్నారు. ఇప్పటి వరకు 2కోట్ల 40 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకున్నారన్నారు. మరో 1380 కొత్త బస్సులను కొనుగోలు చేస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, ఆర్టీసీ ఆర్ఎం వెంకటేశ్వర్లు, డీఎం పెద్దిరాజులు, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, అనిత, సమతాకీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కాశీవిశ్వనాథం, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు విద్యాసాగర్, పి.వి.ఫణికుమార్, అక్కుమహంతి రాజా, హైమావతి, జనసేన నాయకుడు గడ్డం రాజు, చిన్నం శివ పాల్గొన్నారు.

స్వయంగా భోజనం వడ్డించి.. పథకాల లబ్ధిపై ఆరా



మచిలీపట్నం టౌన్ : సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు మంత్రి కొల్లు రవీంద్ర స్వయంగా భోజనం వడ్డించారు. మహిళలతో ఉచిత బస్సు పథకంపై మాట్లాడారు. తల్లికి వందనం అందరికీ అందుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఎలా చదువుతున్నారని ఆరా తీశారు. ఎంఎస్ఎంఈ పథకం కింద దరఖాస్తు చేసుకోమని సూచించారు. ఉచిత గ్యాస్ సిలెండర్ పథకం లబ్ధిని అడిగి తెలుసుకున్నారు.



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



పండితులను సత్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వేముల రవికుమార్

గిడుగు స్ఫూర్తితో తెలుగు భాషాభివృద్ధికి కృషి

● మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగును వ్యవహారిక భాషగా రూపొందించేందుకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలు స్ఫూర్తిగా భాషాభివృద్ధికి కృషి చేద్దామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, గిడుగు స్ఫూర్తితో ఎన్టీ రామారావు తెలుగు.భాషకు చేసిన సేవలు మరచిపోలేమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించి భాషకు పరిపుష్టి చేకూర్చారన్నారు. కలెక్టరేట్‌లో తెలుగుతల్లి విగ్రహానికి కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్వో చంద్రశేఖరరావు, ఏవో రాధిక తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఫైళ్లను తెలుగులో రాయాలని సూచించారు. వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లంకిశెట్టి బాలాజీ, ఎన్ బాబు, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, ఆర్టీసీ డిపో మేనేజరు పెద్దిరాజు, మడమల రాంబాబు, అప్పినేడి పోతురాజు, అనుముకొండ వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ వెంకట్రావుపాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వేముల రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ, డాక్టర్ పన్యారం సాంబశివరావు, మేరీకృపాబాయి తదితరులను సత్కరించారు. డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు. 45వ డివిజన్ సచివాలయంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి టీడీపీ నాయకులు పి.వి.ఫణికుమార్ తదితరులు నివాళులర్పించారు. సచివాలయ కార్యదర్శులు చరణ్, రవికుమార్, కవిత, రమాదేవి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



లేడీయాంప్థిల్ కళాశాలలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మి తదితరులు

గుడిసేవ విష్ణుప్రసాద్‌కు గిడుగు పురస్కారం



అవనిగడ్డ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డకు చెందిన ప్రముఖ సాహితీ వేత్త, సాహిత్య కవి గుడిసేవ విష్ణుప్రసాద్‌కు గిడుగు రామ్మూర్తి స్మారక పురస్కారానికి ఎంపి కయ్యారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయుడిగా పని చేసిన విష్ణుప్రసాద్ దాదాపు 27 గ్రంథాలు రచించారు. సంగీత రూపకాలు, కళారూపాలు రూపొందించి దివి ప్రాంతంలో గుర్తింపు పొందారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ రంగాలకు చెందిన 14 మం దిని గిడుగు పురస్కారానికి ఎంపిక చేయగా, వారిలో గుడిసేవ విష్ణుప్రసాద్‌కు స్థానం దక్కిం ది. గుడిసేవ విష్ణుప్రసాద్‌కు గిడుగు పురస్కారం దక్కటం పట్ల దివి సాహితీ కుటుం బం హర్షం వ్యక్తం చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు

గ్రంథాలయ సంస్థల సెస్ బకాయిల జమకు కృషి

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు కోటేశ్వరరావు

గవర్నర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థలకు చెల్లించాల్సిన సెస్ బకాయిల సమస్యను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి సెస్ బకాయిలు నేరుగా సంస్థ జెడ్‌జీఎస్ ఖాతాల్లో జమ పడేలా కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల సంఘం ద్వితీయ మహాసభ శుక్రవారం రాగూర్ గ్రంథాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గు రిందపల్లి రాంబాబు అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ శాఖా గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లింపునకు ప్రభుత్వం కట్టుబడి ఉం దని, ఆ దిశగా చర్యలు తీసుకునేలా కృషి చేస్తానన్నారు. ఏపీ జెఏసీ చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతులు, పనివేళల మార్పు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పదవీ విరమణ చేసిన తోకల రాంబాబుకు ఆత్మీయ సత్కారం జరిగింది. రాగూర్ గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జీ, కోశాధికారి బి.గణేష్‌బాబు, ఉపాధ్యక్షుడు రంగారావు, సహాయ కార్యదర్శి ఆలీ, జిల్లా అధ్యక్షుడు కె.కృపానందం, కార్యదర్శి చిన్నరాజా తదితరులు పాల్గొన్నారు.





అగ్నిప్రమాదం సమయంలో మంటలను ఎలా నిరోధించాలి, గాయపడిన వారిని తక్షణం వైద్య సహాయానికి తరలించడంపై మాక్‌డ్రిల్

ప్రయాణికుల రక్షణలో రైల్వే సన్నద్ధతపై మాక్‌డ్రిల్

రైల్వేస్టేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే స్టేషన్‌లో సివిల్ డిఫెన్స్ యూనిట్, దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్), బనారస్ లోకో వర్క్స్ (బీఎల్‌డబ్ల్యు)ల పౌర రక్షణ బృందం సంయుక్తంగా శుక్రవారం మాక్ డ్రిల్‌ను నిర్వహించాయి. రైల్వే సిబ్బంది విపత్తు ప్రతిస్పందన బృందాల మధ్య అత్యవసర సంసిద్ధత సమన్వయాన్ని పెంపొందించడం లక్ష్యంగా మాక్ డ్రిల్‌ను నిర్వహించాయి. ప్రధాన రైల్వే హబ్‌లో అగ్నిప్రమాదం జరగడం, బాధితుల తరలింపు, ప్రథమ చికిత్స, సంక్షోభ పరిస్థితులను ఎదుర్కోవడంలో వివిధ విభాగాల సంసిద్ధత, ప్రతిస్పందన సమయం వంటి వాటిని చేసి చూపించారు. అగ్నిమాపక యంత్రాలను ఉపయోగించడం, ప్రమాదాలను తగ్గించడానికి తక్షణం పొగను అదుపు చేయడం వంటి ముఖ్యమైన అగ్ని భద్రతా పద్ధతులను ప్రదర్శించారు. సురక్షితమైన తరలింపు పద్ధతులపై రైల్వే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ప్రయాణికులు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు దివ్యాంగులను సురక్షితంగా చేర్చడానికి మార్గనిర్దేశం చేశారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్, పాసేజ్‌వేలను క్లియర్ చేయడం, బాధితుల కోసం స్ట్రెచర్ తరలింపు, క్రమబద్ధమైన రక్షణ విధానాలను ప్రదర్శించారు సివిల్ డిఫెన్స్ బృందాలు, రైల్వే భద్రతా సిబ్బంది మధ్య సమన్వయం, సంక్షోభంలో కమ్యూనికేషన్ ప్రాముఖ్యతను వివరించారు. ఇదే సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న ప్రయాణికులకు ప్రాథమిక వైద్యం ఎలా చేయాలో చెప్పారు. ప్రొఫెషనల్ వైద్య బృందాలు రాకముందే ముందస్తు వైద్యం ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. క్లిష్టమైన పరిస్థితులలో తక్షణ చికిత్స ప్రాణాలను ఎలా కాపాడుతుందో విశదీకరించారు. విజయవాడ స్టేషన్ స్టేషన్ డైరెక్టర్ ఎం.శైలజ మాట్లాడుతూ స్టేషన్లలో భద్రత కేవలం ఒక ప్రోటోకాల్ కాదు, ఇది మనం ప్రతిరోజూ పెంపొందించుకునే సంస్కృతి. అన్నారు. మాక్ డ్రిల్ రైల్వే యంత్రాంగం సంసిద్ధతను, అన్ని పరిస్థితులలోనూ ప్రయాణీకులను సిబ్బందిని రక్షించడానికి అచంచలమైన నిబద్ధతను చాటిందని తెలిపారు. క్రమం తప్పకుండా చేసే మాక్‌డ్రిల్‌లు రైల్వే బృందాలు అప్రమత్తంగా, సమన్వయంతో క్షణంలో చర్య తీసుకోవడానికి సిద్ధంగా ఉండడానికి సహకరిస్తాయని తెలిపారు. ప్రయాణికుల భద్రత, సమర్థవంతమైన విపత్తు ప్రతిస్పందన విధానాల పట్ల భారతీయ రైల్వేల అంకితభావాన్ని బలోపేతం చేస్తూ రక్షణ బృందాల వేగవంతమైన క్రమశిక్షణ చర్యలను అధికారులు ప్రశంసించారు.

ఈ కార్యక్రమాన్ని స్టేషన్ మాస్టర్ సాంబశివరావు, దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ (సీనియర్ సీడీఐ) టి. సుధీర్ బాబు, బనారస్ లోకో వర్క్స్ జనరల్ మేనేజర్ ప్రోటోకాల్ ఆఫీసర్ మార్కండేయ మిశ్రా పర్యవేక్షణలో నిర్వహించారు.

కృష్ణా వర్సిటీ బీ-ఫార్మసీ కళాశాలకు ప్రభుత్వ గుర్తింపు

మచిలీపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాయూనివర్సిటీ ప్రాంగణంలో నడుస్తున్న బీ-ఫార్మసీ కళాశాలకు ప్రభుత్వం అనుమతు లు ఇస్తూ ఈనెల 28వ తేదీన జీవో ఆర్‌టీనెంబరు 155ను జారీ చేసింది. 2025-26 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలోని 91 ఫార్మసీ కళాశాలలకు అనుమతులను పొడిగిస్తూ ఈనెల 12వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో కృష్ణాయూనివర్సిటీలో నడుస్తున్న బీ-ఫార్మసీ కళాశాల పేరు లేదు. దీంతో గత ఐదు సంవత్సరాలుగా నడుస్తున్న బీ-ఫార్మసీ కళాశాల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఫార్మసీ కళాశాలకు గుర్తింపు ఇవ్వక పోవడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 18వ తేదీన కృష్ణ..కృష్ణా అనే శీర్షికతో కథనం ప్రచురితం అయ్యింది. దీంతో యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిపి ఎట్టకేలకు బీ-ఫార్మసీ కళాశాలకు అనుమతులు తీసుకువచ్చా రు. 2025-26 విద్యాసంవత్సరంలో కృష్ణాయూనివర్సిటీకి బీ-ఫార్మసీ కళాశాలలో 60 సీట్లకు ప్రభు త్వం అనుమతులు ఇచ్చింది.

కలవపాముల పీఏసీఎస్ సీఈవో, అసిస్టెంట్‌పై కేసు

ఉయ్యూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కలవపాముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా అమ్మకాల్లో అవకతవకలకు సంబంధించి సంఘం సీఈవో రోజారమణి, అసిస్టెంట్ నాగదుర్గపై 6ఏ కేసు నమోదు చేసినట్టు వ్యవసాయ శాఖ గన్నవరం అసిస్టెంట్ డైరెక్టర్ సునిల్ శుక్రవా రం తెలిపారు. అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై అధికారుల బృందం రికార్డులు, బిల్లు పుస్తకాలు తనిఖీ చేసి నిర్ధారణ కావడంతో ఇద్దరిని బాధ్యులను చేస్తూ 6ఏ కేసు నమోదు చేసి, తగిన చర్యలకు సహకార శాఖ అధికారులకు నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. సంఘంలో అమ్మకాలను ఇందుపల్లి సంఘానికి ప్రస్తుతం అప్పగించామన్నారు. యూరియా అ వకతవకలపై ఆర్డీవో హేలాషారోన్ గురువారం తనిఖీ బృందంతో కలసి పరిశీలించి బాధ్యు లపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

క్రీడాకారులకు రూ.1.98 కోట్ల ప్రోత్సాహం

విజయవాడ (స్పోర్ట్స్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో బంపర్ ఆఫర్ అందించిందని శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. గురువారం రూ.4.9 కోట్ల క్రీడా ప్రోత్సహకాలు విడుదల చేసిన ప్రభుత్వం శుక్రవారం మరో రూ.1.98 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఏపిలో 177మంది జాతీయ క్రీడాకారులకు ప్రోత్సహకాలు విడుదల చేయడం హర్షణీయం అన్నారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు వారిని గౌరవించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు క్రీడాకారుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



యాంటీ లార్వా చర్యలపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

ఉద్యమంలా ఫ్రైడే-డ్రైడే

విజయవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఫ్రైడే-డ్రైడేను ఉద్యమంలా అందరూ పాటించాలని, ఏ ఒక్క ఇంటిని విడిచిపెట్టకుండా పరిశీలించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుహాసిని పేర్కొన్నారు. హుడా కాలనీ ఎంఐజీ అపార్ట్‌మెంట్స్ వద్ద శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. యాంటీ లార్వా చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కలిగించేలా లార్వా నివారణ కార్యక్రమాలు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, డాక్టర్ పద్మావతి, ఏఎంవో సూర్యనాయక్, ఎస్‌యువో రామచంద్రారెడ్డి, హెచ్.వి.అసుంత, ఏఎన్ఎం లు, ఆశాలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి జాతీయ సదస్సులు దోహదం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సామాజిక ఆర్థిక వృద్ధిని మెరుగు పరచడం కోసం పార్లమెంటరీ కమిటీ నిర్వహించే జాతీయ సదస్సులు దోహదపడతాయని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే ఆల్‌ఇండియా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల పార్లమెంటరీ కమిటీ జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి సాంఘిక సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ హోదాలో ఎమ్మెల్యే కుమార్‌రాజా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కూచిపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మొవ్వలో జయలక్ష్మి సీ ఫుడ్స్ అనే రొయ్య కంపెనీకి సమీపంలో కూచిపూడి నుంచి చల్లపల్లి వెళ్లే రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొడాలి వినోద్ కుమార్ బైక్‌పై మొవ్వ వచ్చి తిరిగి ఘంటసాల మండలం తాడేపల్లి తన ఇంటికి వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఆటో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో వినోద్ తీవ్రంగా గాయపడ్డాడు. కూచిపూడి ఎస్సై విశ్వనాథ్ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైతులకు, కాలనీ ప్రజలకు మురుగు సమస్య

● మురుగు ప్రవాహాన్ని అడ్డుకుంటున్న గుర్రపుడెక్క

తోట్లవల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో గుర్రపుడెక్క రైతులకు, కనకదుర్గమ్మ కాలనీ ప్రజలకు మురుగు సమస్యను సృష్టిస్తోంది. తోట్లవల్లూరు కనకదుర్గమ్మ కాలనీకి పడమరవైపు చిల్లడొంక పంట కాల్వ, దక్షిణం వైపు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కగా వెళ్లే మరో పంట కాల్వ ఉన్నాయి. ఈ రెండు వైపులా పంట కాల్వల్లో దట్టంగా గుర్రపుడెక్క అల్లుకుపోయింది. దీంతో వర్షంవస్తే మురుగు దిగువకు ప్రవహించకుండా వరి పొలాల్లోను, కాలనీలోను రోజుల తరబడి నిల్వ ఉంటోందని స్థానికులు తెలిపారు. ఈ మురుగుతో కాలనీలో కొన్ని రోడ్లపైన, గృహాల వెంట పల్లపు ప్రదేశాల్లో నిల్వ ఉండి దోమల సమస్య తీవ్రంగా ఉంటోందని ప్రజలు తెలిపారు. అలాగే చిల్లడొంక ఎగువ పొలాల్లోను మురుగు తిష్ట వేస్తోందని రైతులు తెలిపారు. గ్రామ పంచాయతీగాని, ఇరిగేషన్ అధికారులు గాని ఈ గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.



కనకదుర్గమ్మ కాలనీ వెనుక వైపు చిల్లడొంక పంట కాలువలో గుర్రపుడెక్క



సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం

గుడివాడ, అగస్టు 29(ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ద్వారా కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి పేర్కొన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినందుకు కృతజ్ఞతగా ప్రజావేదికలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు శుక్రవారం టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. సయ్యద్ జబీన్, గూడూరు సురేంద్ర, సూరగాని సూరిబాబు, ప్రసాద్, వంశీ, పాపారావు, ఇషాక్, క్రాంతి పాల్గొన్నారు.

దాడిని ఖండించిన కార్యదర్శులు

గుడివాడ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో కార్యదర్శిపై డిజిటల్ అసిస్టెంట్ దాడి చేయటాన్ని ఖండిస్తూ డీఎల్‌పీవో కార్యాలయం వద్ద శుక్రవారం కార్యదర్శులు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎల్‌పీవోకు వినతిపత్రం అందించారు. డిజిటల్ అసిస్టెంట్‌ను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో కార్యదర్శులపై సచివాలయ ఉద్యోగులు దురుసుగా ప్రవర్తించకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బి.హరికృష్ణ, కోటయ్య, రామ్మోహనరావు పాల్గొన్నారు.

కొనకళ్ల సీతయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం

గుడివాడ, అగస్టు 29(ఆంధ్రజ్యోతి) : ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దోరడ్ల సుబ్బలక్ష్మీకి అత్యవసరంగా ఓ-పాజిటివ్ రక్తం అవసరం కావడంతో కొనకళ్ల సీతయ్య ట్రస్ట్‌కు సమాచారం అందించారు. శుక్రవారం ట్రస్ట్ సభ్యులు లపంగి గోపయ్య, దేసు సూర్య రక్తదానం చేశారు. రక్తదాతలను ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య, ట్రస్ట్ సభ్యులు అభినందించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

గుడివాడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ఎన్టీఆర్ స్టేడియంను నందమూరి తారకరామారావు నిర్మించారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 25, 26తేదీల్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల అండర్-14, 16 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. శుక్రవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్, పర్వతనేని జగన్మోహనరావు విగ్రహాలకు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. పోటీల్లో గెలపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

బేతవోలు పాఠశాల హవా

స్టేడియంలో జరిగిన పోటీల్లో బేతవోలు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు అంశాల్లో పతకాలను సాధించారని ప్రధానోపాధ్యాయురాలు సంధ్య తెలిపారు. పాఠశాల విజేతలను అభినందించారు. పాఠశాల వ్యాయామోపాధ్యాయులు సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యావికాస్ విద్యార్థులకు అభినందన

విద్యావికాస్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు షాట్‌పుట్, పరుగుపందెం విభాగాల్లో పతకాలను సాధించారని పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో పతకాలు సాధించినవారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



షటిల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఏఎన్‌ఆర్ కళాశాలలో..

గుడివాడ: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళ్ళులర్పించారు. ఆటలపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికేట్‌లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షకార్యదర్శులు ఎల్.ఆర్.కె.ప్రసాద్, కె.ఎస్.అప్పారావు, కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రామారావు, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ విద్యార్థులకు బహుమతులు

షైనింగ్ స్టార్ విద్యార్థులు మహ్మమద్ అయాస్ లాంగ్‌జంప్‌లో ప్రథమ, 800మీటర్ల పరుగుపందెంలో తృతీయ, 400మీటర్లు విభాగంలో అనీషా తృతీయ, చిన్ని కృష్ణ డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానం సాధించారని పాఠశాల పాఠశాల డైరెక్టర్‌లు లింగంనేని స్రవంతి, జగదీష్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విజేతలను అభినందించారు. కార్యక్రమంలో కోచ్ సురేష్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

పెంజంద్ర హైస్కూల్‌లో..

గుడ్లవల్లేరు: పెంజంద్ర జిల్లాపరిషత్ హైస్కూల్‌లో జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగు భాష దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలో నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. హెచ్‌ఎం కె.మహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పమిడిముక్కల జడ్పీ స్కూల్‌కు జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

పమిడిముక్కల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పమిడిముక్కల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. 2024లో హాకీలో 24 మంది, ఆర్చరీలో 23మంది బాలబాలికలు, హాకీలో ఒక జాతీయ క్రీడాకారిణి 242పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలవగా, 2025వ సంవత్సరానికి హాకీలో 18మంది, ఆర్చరీలో 19మంది బాలబాలికలు పాల్గొనగా ఒకరు జాతీయ స్థాయి హాకీలో 192 పాయింట్లతో ప్రథమస్థానం సాధించారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో శుక్రవారం జరిగిన జిల్లాస్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యలమంచి దుర్గాభవాని, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈవీ సత్యనారాయణ అవార్డు, ప్రశంసాపత్రం ట్రైనీ కలెక్టర్ పరహినాజహీద్, ఏఎస్‌పీడీ ప్రసన్నకుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు, స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి అజయ్ నుంచి అందుకున్నారు. రామాంజనేయులు, రామకృష్ణ, శ్రీకుమార్, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.



కృష్ణా డీఈవో రామారావు, ఎన్టీఆర్ డీఈవో సుబ్బారావు నుంచి ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం వై.దుర్గాభవాని, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈవీ నారాయణ



కూచిపూడి కళాపీఠంలో తెలుగు తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాట్యాచార్యులు, అధ్యాపకులు

మధురమైనది తెలుగు భాష



పెడసనగల్లు హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి, ధ్యానచంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కూచిపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మధురమైనది తెలుగు భాష అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఘనంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. మొవ్వ మండలం పెడసనగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు, ధ్యానచంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. హెచ్‌ఎం సంజీవరావు, ఎస్‌ఎంఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీసిదేంద్ర కళాపీఠంలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగుభాషకు చేసిన సేవలను కొనియాడారు. కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, నాట్య అధ్యాపకులు యేలేశ్వరపు శ్రీనివాస్, డాక్టర్ వెంపటి దుర్గాభవా ని, వసుమర్తి హరనాథ్ శాస్త్రి, గ్రంథాలయాధికారి వై.వి.ఫణి కుమార్ పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ: దేశభాషలందు తెలుగు లెస్స అని, తెలుగు భాష గొప్పతనం అందరికి తెలియాలని ఏఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్ అన్నారు. ఏఎన్‌ఆర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి, కళాపీఠం కన్వీనర్ డి.ఎస్.ప్రత్యూష తెలుగు భాష గురించి, గిడుగు రామ్మూర్తి గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్.అప్పారావు తెలుగు భాషను గురించి, వ్యవహారిక భాషలో వచ్చిన కవితలు, నాటికలు, నవలలు గురించి తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. పాలకవర్గ అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు. శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, తెలుగు అధ్యాపకులు డి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాంటిస్సోరి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కావూరి శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళ్ళులర్పించారు. ఉమ్మడి జిల్లా పర్యావరణ కమిటీ చైర్మన్ నందమూరి జయలక్ష్మి, చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కోశాధికారి బచ్చు రాధాకృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి చలువాది మోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యాచార్యులు పసుమర్తి శేషుబాబుకు గిడుగు రామ్మూర్తి పంతులు అవార్డు

కూచిపూడి: ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు పసుమర్తి శేషుబాబుకు గిడుగు రామ్మూర్తి పంతులు పేరున అవార్డు వరించింది. ప్రభుత్వ యువజన అభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వివిధ కళల్లో నిష్ణాతులైన 14 మందిని ప్రభుత్వం ఎంపిక చేసింది. రూ.25 వేలు, జ్ఞాపిక అందించి సత్కరించారు.

వైభవంగా గణపతి నవరాత్రులు



గుడివాడలో శ్రీ హేరంభ గణపతి అలంకారంలో స్వామి



పెదపారుపూడిలో మట్టి వినాయకుడు



వెంట్రప్రగడలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

గుడివాడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మెయిన్‌రోడ్డులో విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో గణపతి నవరాత్ర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు స్వామివారు శ్రీహేరంభగణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు), ధర్మకర్తల కమిటీచైర్మన్ సాయన రాజేష్, సభ్యులు లోయ వాసు, ముళ్లపూడి రమణమూర్తి, విక్కుర్తి పోతురాజు, పంచుమర్తి శ్రీనివాసరావు, శారద, శైలజ తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపురంలోని బాలగణపతి దేవాలయంలో శుక్రవారం శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. వేదపండితులు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పమిడిముక్కల మండలంలో..

పమిడిముక్కల: కాలనీలు, కూడళ్లలో వినాయకచవితి వేడుకకు పందిళ్లువేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గుర్రాలంక మండపంలో శుక్రవారం టీడీపీ నాయకులు బాబూరావు, రామాంజనేయప్రసాద్, శివనాగేశ్వరరావు, బొల్లా మల్లి తదితరులు పూజలు చేశారు. హనుమంత పురంలో విఘ్నేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు.

పెదపారుపూడిలో ఆకర్షిస్తున్న మట్టి వినాయకుడు

పెదపారుపూడి: పెదపారుపూడిలోని శ్రీసీతారామస్వామి వారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరుతున్నారు. మూడో రోజు స్వామి వారు శ్రీగణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం విగ్రహ దాతలు గుత్తా శ్రీనివాసరావు, రామలక్ష్మీ, సత్యాన్వేష్, సాయి చందు ఆజాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. వెంట్రప్రగడలో గణనాథుని నిమజ్జనం ఊరేగింపుగా డప్పువాయిద్యాలతో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు జాజుల ప్రసాద్, పామర్రు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చిలకా అంజనేయులు, పీఏసీఎస్ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ గొరిపర్తి రవికుమార్, పునుగోటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడకు పూర్వవైభవం



శ్రీకృష్ణ తులాభారంలో రక్తికట్టించే సన్నివేశం

గుడివాడ: ఎంతో మంది కళాకారులను తయారు చేసి కళల కర్మాగారంగా పేరొందిందని, తిరిగి గుడివాడకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా జానపద, పౌరాణిక, పద్య నాటకాలను ప్రభుత్వం ప్రోత్సహించడం అభినందనీయమని కళాపోషకులు వంగా శ్రీనివాస్(వంశీ), ఎస్.మల్లిక్ అన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గుడివాడ శ్రీరాజరాజేశ్వరీ నాట్యమండలి బి.నాగలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణతులాభారం పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. నాటకంలో ప్రధాన పాత్రధారులుగా పుప్పాల రంగారావు, బి.నాగలక్ష్మి, గంధం రాజేశ్వరి, జి.శివకుమారి, బి.శోభారాణి నటించారు.

రైతులకు సత్కారం

పెదపారుపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విజయధార రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వెంట్రప్రగడ, పెదపారుపూడి మండలంలో బలరాముని జయంతి సందర్భంగా రైతు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ రంగంలో కృషి చేసిన పెదపారుపూడి మండలంలో అనుభవజ్ఞులైన రైతులను సత్కరించారు. పెదపారుపూడి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర సంఘటిత కార్యదర్శి కొండబాబు, విజయధార చైర్మన్ ప్రెక్కే సుబ్బారావు, నారాయణ సేవాసమితి సెక్రటరీ బూరగడ్డ వెంకట సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్ కూచిపూడి వెంకట సుబ్బారావు చౌదరి, పామర్రు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చిలక ఆంజనేయులు, మాజీ సర్పంచ్ జాస్తి రామచంద్రరావు పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా నిమజ్జనాలు జరుపుకోండి

పెదపారుపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్వహించాలని ఎంపీడీవో, తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడారు. ఊరేగింపు సమయంలో గొడవలు రాకుండా, చూసుకోవాలన్నారు. ఎంపీడీవో విమాదేవి, తహసీల్దార్ శ్రీను నాయక్, ఎస్సై ప్రవీణ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ అనిల్, డీటీ యేసుపాదం పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: గణేష్ నిమజ్జన సమయంలో ఎటువంటి అపశ్రుతులు దొర్లకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం గణేష్ ఉత్సవాల నిర్వాహకులకు కేటాయించిన రేవులను మండల అధికారులతో కలసి పరిశీలించారు. బారికేట్లను ఏర్పాటు, విద్యుత్ ఫోకస్ లైట్లు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ లోకరాజు, ఎంపీడీవో ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సెరివేల్పూరులో పొలం పిలుస్తోంది

గుడివాడ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు త్వరలోనే యూరియా వస్తుందని ఏవో బి.అనంతలక్ష్మి అన్నారు. శుక్రవారం సెరివెల్పూరులో పొలం పిలుస్తోంది నిర్వహించారు. అవసరమైనవారు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని, నిల్వ ఉంచవద్దని తెలిపారు. ప్రతీ రైతుకు ఎరువులు అందేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొమ్ములూరు, సిద్ధాంతం, సెరివేల్పూరు రైతులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

● స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో మంత్రి కొల్లు రవీంద్ర



స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించడానికి స్మార్ట్ రేషన్ కార్డులు దోహద పడతాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో 45వ డివిజన్‌కు చెందిన మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. త్వరలో స్మార్ట్ ఈటీ పాస్ మిషన్లు అందుబాటులోకి వస్తాయన్నారు. సందేహాల నివృత్తికి 1967 టోల్‌ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

● బందరు మండలం కానూరులో స్మార్ట్ రేషన్ కార్డులను తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పంపిణీ చేశారు.

గూడూరు, మల్లవోలులో..

గూడూరు: డీసీ చైర్మన్ పోతన స్వామి ఆధ్వర్యంలో గూడూరు గ్రామంలో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎన్ఏ బేగ్, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, పాల్గొన్నారు. మల్లవోలులో స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ గ్రామ అధ్యక్షుడు బాసంశెట్టి శ్రీనివాసరావు, బత్తిన బుజ్జి, చీడేపూడి ఏడుకొండలు, పడవల మోహన్ త్రినాథ్ పంపిణీ చేశారు.



అవనిగడ్డలో క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్

యువత క్రీడల్లోనూ రాణించాలి

అవనిగడ్డ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ క్రీడా మైదానంలో సబ్ జోన్ ఆటల పోటీల విజేతలకు దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్‌తో కలిసి శుక్రవారం ఆమె బహుమతులు అందజేశారు. క్రీడాకారులు, విద్యార్థులు జాతీయ పతాకాలు, క్రీడా పతాకాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాజనాల వీరబాబు, ఎంపీడీవో వనజాకుమారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి, హెచ్‌ఎం కె.సుజాత, కేపీటీ కుమార్, సీహెచ్ దొరబాబు, వ్యాయామోపాధ్యాయుల సంఘ నేతలు డి.వెంకటేశ్వరరావు, బీపీఎల్ ప్రసాద్, తోట నవీన్ పాల్గొన్నారు.

వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో..

పెడన రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, ఖోఖో, చెస్, క్యారమ్స్ ఆటలపోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరెక్టర్ దోసపాటి బాబా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా రమేష్ పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

నాగాయలంక, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాలి గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు కేసు నమోదు చేశామని ఎస్సై కె.రాజేష్ తెలిపారు. 'గ్రామానికి చెందిన నాయుడు దానియల్ బాబు(19) తల్లి, చెల్లితో నివసిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం తన తల్లి, చెల్లి నిలువ కూలీ పనుల కోసం వేరే రాష్ట్రానికి వెళ్లారు. దానియల్ బాబు ఒక్కడే ఇంటి వద్ద ఉంటున్నాడు. బుధవారం రాత్రి 7.30 గంటలకు తన నాయనమ్మ ఇంటికి వెళ్లి అన్నం పెట్టమని అడిగాడు. ఆమె వండలేదు అని చెప్పింది. ఇంటికి వెళ్లి తన తల్లికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. మనస్థాపంతో తన ఇంటిలో తాటిపట్టెకు చీరతో ఉరి వేసుకుని చనిపోయాడు. వేలాడుతున్న దానియల్‌బాబును స్నేహితులు గుర్తించి నానమ్మకు చెప్పారు. ఆమె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం.' అని ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయులు బాధ్యతగా ఉండాలి

పెడన రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులతో బాధ్యతగా ఉండాలని, వారి మనోభావాలు కించపరిచేవిధంగా మాట్లాడొద్దని ఎంఈవో సలోమి హెచ్చరించారు. కొంకేపూడి జడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న కొందరు విద్యార్థులను వారి మనసు బాధించేలా ఉపాధ్యాయిని వరలక్ష్మి మాట్లాడడంతో విద్యార్థులు హెచ్‌ఎం శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె విచారించకుండా విద్యార్థులనే వారించడంతో వారి తలిదండ్రులకు చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంఈవో సలోమి శుక్రవారం పాఠశాలకు వెళ్లారు. అదే సమయంలో విద్యార్థుల తలిదండ్రులు, సర్పంచ్ దావు బైరవలింగం, ఎస్సీ సంఘ నాయకుడు జక్కుల ఆనందబాబు, పెద్దలు హైస్కూల్‌కు వెళ్లి హెచ్‌ఎం శ్రీదేవిని, ఉపాధ్యాయురాలు వరలక్ష్మిని నిలదీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ఎంఈవో హామీ ఇచ్చారు. బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి



పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వెంకటాపురం గ్రామస్థులు

మోపిదేవి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామం లో డ్రెయినేజీ పూడికతీత, బ్లీచింగ్, దోమల నివారణ మందు పిచికారీ పనులు వెంటనే చేపట్టాలని గ్రామస్థులు శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. వర్షం వచ్చినపుడు ప్రధాన కూడలి నుంచి జడ్పీ పాఠశాల వద్ద ఉన్న పంట బోదె వరకు డ్రెయినేజీ పూడికతీత లేక మురుగునీరు నివాస గృహాల ఎదుటే నిలబడి ఉంటోందని తెలిపారు. దోమల విజృంభిస్తున్నా నివారణ చర్యలు చేపట్టడం లేదన్నారు. సచివాలయ కార్యదర్శి వాసుకు వినతిపత్రాన్ని అందించారు. పేరుబోయిన వెంకటేశ్వరరావు, నలుకుర్తి కృష్ణ, గంజాల లక్ష్మణరావు, గంజాల నాగబాబు పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి సాయం

గూడూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నారికేడలపాలెం గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా దగ్ధమైన జన్ను గోపాలరావు కుటుంబానికి రెడ్‌క్రాస్ శుక్రవారం సాయమందించింది. వంట సామగ్రి, టార్పాలిన్, తదితర వస్తువులను అందించారు. రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ శంకర్‌నాథ్, ట్రెజరర్ కొండపల్లి రామ్‌బాలాజీ, జిల్లా కో ఆర్డినేటర్ హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

చల్లపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి రాజా కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం(1988-2020) ఆధ్వర్యంలో చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని సంఘ నేతలు తెలిపారు. పూర్వవిద్యార్థులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.



అవనిగడ్డలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం, మండలి వెంకటకృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మండలి వెంకట్రామ్



వేకనూరు హైస్కూల్‌లో తెలుగుతల్లి, గిడుగు రామ్మూర్తి వేషధారణలో విద్యార్థులు



పెదప్రోలులో కాసుల పురుషోత్తమ కవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు,



ఉల్లిపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద గిడుగు రామ్మూర్తి, మండలి కృష్ణారావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సాయిబాబు తదితరులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్/ కోడూరు/ చల్లపల్లి/మోపిదేవి/నాగాయలంక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగాధిపతి డి.భాగ్యవేణి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతిని నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు పూషడపు సుబ్బారావు, సాహితీవేత్త గుడిసేవ విష్ణుప్రసాద్, ప్రిన్సిపాల్ డి.ఉమారాణి, వైస్ ప్రిన్సిపాల్ నాగార్జున పాల్గొన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి, మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ నివాళులర్పించారు. కూనపరెడ్డి చంద్రశేఖర్‌రావు, బచ్చు రఘునాథ్‌ప్రసాద్, శోభిల ఏడుకొండలు, యలవర్తి ఆది, రహదుల్లా పాల్గొన్నారు. అవనిగడ్డ టీడీపీ కార్యాలయంలో రామ్మూర్తి పంతులు, నందమూరి హరికృష్ణ చిత్రపటాలకు టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, కర్రా సుధాకర్, బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు, ముళ్లపూడి శ్రీను, అడపా శ్రీను నివాళులర్పించారు. అవనిగడ్డ మండలం వేకనూరులోని విశ్వనాథుని శ్రీనివాసులు మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రమేష్ సాగర్ పాల్గొన్నారు. కోడూరు మండలం ఉల్లిపాలెంలో తెలుగుతల్లి విగ్రహం వద్ద గిడుగు రామ్మూర్తి, మండలి వెంకట కృష్ణారావు చిత్రపటాలకు లయన్స్ క్లబ్ కోడూరు అధ్యక్షుడు పూతబోయిన సాయిబాబు నివాళులర్పించారు. కోట రాంబాబు, కాగిత రామారావు, కాటూరి మోహనరావు, తలశిల నరసింహారావు, పూతబోయిన రత్నకుమార్, ముద్దినేని చంద్రరావు పాల్గొన్నారు. చల్లపల్లి మండలం పురిటిగడ్డ జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థులకు పద్యపఠనం, వ్యాసరచన, ఆంగ్ల పదం దొర్లకుండా తెలుగులో రెండు నిమిషాలు మాట్లాడడం, తెలుగు చార్టులు రాయడంపై తెలుగు ఉపాధ్యాయినులు డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి, రాణి పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు. మోపిదేవి మండలం పెదప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పద్యాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రామానికి చెందిన శ్రీకాసుల పురుషోత్తమ కవి విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయిని దిడ్ల ప్రసన్నరాణిని సత్కరించారు. హెచ్‌ఎం ఏవీ రమణ, ఎస్‌ఎంసీ చైర్మన్ వై.అనిత పాల్గొన్నారు. తెలుగు భాషకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన మహనీయుడు దివంగత మండలి వెంకట కృష్ణారావు అని లోక్ అదాలత్ సభ్యుడు కొండవీటి ఈశ్వరరావు అన్నారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల్లో 26వ రోజు, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మండలి కృష్ణారావు విగ్రహం వద్ద ఈశ్వరరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయ భాస్కర్, దున్నా రాజేష్, బండ్రెడ్డి మల్లికార్జున్, బండ్రెడ్డి హరి తదితరులు నివాళులర్పించారు.



టీడీపీ అవనిగడ్డ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి, నందమూరి హరికృష్ణ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

బంగారు ఆభరణాల చోరీ కేసు ఛేదన?

చల్లపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నారాయణరావునగర్‌లో జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించినట్లు తెలుస్తోంది. ఫిర్యాదుదారులు అనుమానించిన వారే నిందితులని నిర్ధారించి వారి నుంచి ఆభరణాలు రికవరీ చేసే పనిలో నిమగ్నమయ్యారని సమాచారం. వివరాల ప్రకారం.. నారాయణరావునగర్ కాలనీకి చెందిన కారు డ్రైవర్ నర్రా వెంకటేశ్వరరావు ఇంటిలో ఈనెల 26వ తేదీన చోరీ జరిగింది. మంగళవారం ఉదయం వెంకటేశ్వరరావు విధులకు వెళ్లగా, భార్య ప్రభావతిని కుమారుడు మోపిదేవి గుడివద్ద దించి విధులకు వెళ్లిపోయాడు. గుడికి వెళ్లేప్పుడు ఇంటికి తాళం వేసి బయట గ్రైండర్‌లో ఉంచి పైన వస్త్రం కప్పివెళ్లింది. బుధవారం పండగరోజు పూజచేసుకునే సమయంలో బంగారు ఆభరణాలు వేసుకోవాలని బీరువా తీసి చూడగా ఆభరణాలు కనిపించలేదు. చోరీ అయినట్టు నిర్ధారించుకుంది. బంగారు గొలుసు, నెక్లెస్, నల్లపూసల గొలుసు, ఉంగరాలు, బ్రాస్‌లెట్, మ్యాటీలు, చెవిదిద్దులు, కేడీఎం బిస్కట్ ముక్క మొత్తం 150 గ్రాముల బంగారం పోయినట్టు ప్రభావతి పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఇంటిలో నుంచి గుడికి వెళ్లేప్పుడు ఇంటిపక్కన ఉండే మహిళతో మాట్లాడుతూ తాళం గ్రైండర్‌లో వేశానని, ఆభరణాల చోరీపై వారిపైనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొనడంతో ఎస్సై పీఎస్వీ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారు. ఆభరణాల విలువ సుమారు పదిలక్షలపైనే ఉండటంతో సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారే చోరీ చేశారని నిర్ధారణ అయిందని సమాచారం. త్వరలో పూర్తి వివరాలను తెలియచేసి నిందితులను మీడియాకు చూపే అవకాశముంది.

మిలాద్ ఉన్ నబీనీ రాజకీయం చేస్తారా

● వైసీపీ నాయకులపై టీడీపీ నేత ఇలియాస్ పాషా ఆగ్రహం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీని కూడా వైసీపీ నాయకులు రాజకీయంగా వాడుకుంటున్నారని టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు ఎండీ ఇలియాస్ పాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పోలీసులు ముందుగానే కమిటీ పెద్దలతో మాట్లాడారని తెలిపారు. 4వ తేదీ తరువాత బ్యానర్లు కట్టుకోవాలని చెప్పారని అన్నారు. దీనికి మంత్రి కొల్లు రవీంద్రకు సంబంధం లేదని తెలిసినా వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, బచ్చుల అనిల్‌కుమార్, తెలుగుయువత అధ్యక్షుడు సలీం, 15వ డివిజన్ ఇన్‌చార్జి హసీంబేగ్, 33వ డివిజన్ ఇన్‌చార్జి అమీర్, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఫిరోజ్ పాల్గొన్నారు.

కోస్తా రహదారి ఉద్యమకారుడు

కొక్కిలిగడ్డ కోదండరామయ్య కన్నుమూత



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కోస్తా రహదారి కోసం ఉద్యమాలు చేసిన కొక్కిలిగడ్డ కోదండరామయ్య శుక్రవారం తెల్లవారుజామున సర్కిల్ పేటలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని మంత్రి కొల్లు రవీంద్ర సందర్శించి నివాళులర్పించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ పాల్గొన్నారు.

పులిగడ్డ-పెనుమూడి బ్రిడ్జి వద్ద భారీ గేట్లు ఏర్పాటు

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ పంచాయతీ పరిధిలోని పులిగడ్డ-పెనుమూడి బ్రిడ్జి వద్ద వినాయకుడి విగ్రహాలు నిమజ్జనం చేసేటప్పుడు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా భారీ గేట్లు ఏర్పాటు చేశారు. అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాస్, సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, పంచాయతీ ఈవో అనిత, టోల్ గేట్ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు.



బ్రిడ్జి వద్ద భారీ గేట్లు ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

అఖండ మెహెర్ నామ సంకీర్తన ప్రారంభం



అఖండ మెహెర్ నామ సంకీర్తన చేస్తున్న బాబా భక్తులు

చల్లపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అవతార్ మెహెర్‌బాబా కేంద్రం గ్రామంలో స్థాపించి 60 ఏళ్లైన సందర్భంగా 60వ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు వేడుకలు నిర్వహించనున్నారు. తొలిరోజు అఖండ మెహెర్ నామ సంకీర్తనను ప్రారంభించారు. 60 గంటలపాటు నిర్విఘ్నంగా సంకీర్తన చేస్తారు. ఆంధ్రా సెంటరు కార్యదర్శి తాడేపల్లి మెహెర్‌బాబా, చుండూరు మెహెర్ ప్రసాద్, పత్రి వెంకట రమణారావు పాల్గొన్నారు.

ఎస్టీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేత

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమం సత్ఫలితాలిస్తోందని జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం అశ్వారావుపాలెంలో గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన సభలో ఐదుగురు ఎస్టీ మహిళలకు పీ-4 కార్యక్రమం కింద సర్పంచ్ పండ్రాజు నాగ వెంకట లంకమ్మప్రసాద్ ఆర్థిక సాయంతో నూతన కుట్టు మిషన్లను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కటికల వసంత్, నీటి సంఘం అధ్యక్షుడు దాసినేని శ్రీనివాస్, విశ్వనాథుని మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శి ఉదయలక్ష్మి, వీఆర్వో చాంద్రిలత పాల్గొన్నారు.

కుట్టుమిషన్, నగదు, సరుకుల వితరణ

చల్లపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమ స్ఫూర్తితో ఉపసర్పంచ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ముమ్మనేని నాని పేదలకు సాయంచేయటం అభినందనీయమని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు అన్నారు. నారాయణరావునగర్‌లోని ఎస్టీ ప్రాంతంలో పేదలకు శుక్రవారం అధికారుల చేతులమీదుగా ముమ్మనేని నాని సాయమందించారు. భర్తను కోల్పోయి బడ్డీకొట్టు ఆధారంగా జీవనం సాగిస్తున్న కళ్లేపల్లి కోటేశ్వరికి రూ.5 వేలు నగదు, రూ.5 వేల విలువైన సరుకులను అందజేశారు. పూరింటిలో నివసిస్తున్న కూతాడ పద్మకు జీవనోపాధి నిమిత్తం కుట్టుమిషన్‌ను వితరణగా అందించారు. ఎంపీడీవో ఎ.వి.రమణ, సొసైటీ పర్సన్ వేముల హరికృష్ణ పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు నాగేశ్వరరావుకు నివాళి

ఘంటసాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మొవ్వ నాగేశ్వరరావు మృతి చెందారు. శుక్రవారం భౌతికకాయానికి జనసేన యువ నాయకుడు మండలి వెంకట్రామ్ నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, గుత్తికొండ వరప్రసాద్, యార్లగడ్డ వీరభద్రరావు, మొవ్వ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నాగాయలంక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకుని, సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ జి.వెంకటరాజు సూచించారు. మండలంలో 60 మంది సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. 3కేవీ యూనిట్ విలువ రూ.2.25 లక్షలు కాగా, రూ.78 వేలు రాయితీ ఉంటుందన్నారు. 5 కేవీ యూనిట్ విలువ రూ.3.20 లక్షలు కాగా, రూ.70 వేల రాయితీని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. 3 కేవీ ద్వారా 360 యూనిట్లు, 5 కేవీ ద్వారా 600 యూనిట్లు నెలకు ఉత్పత్తి అవుతుందన్నారు. వినియోగదారులు తమ అవసరాలకు వాడుకోగా, మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం తీసుకుని నగదును వినియోగదారులకు అందిస్తుందన్నారు. నాగాయలంకలో సోలార్ విద్యుత్ వినియోగదారులైన జల్లారి మురళీధర్‌కు రూ.1,600, మాటూరి వాసుదేవరావుకు రూ.850 మిగులు విద్యుత్ ఇచ్చినందుకు చెక్కులను అందించామన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

నాగాయలంక, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరదల కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను ఆదుకోవాలని మత్స్యకార నేత, టీడీపీ నేత లకనం నాగాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాగాయలంకలో కృష్ణానది ఒడ్డున నివాసముంటున్న మత్స్యకారులతో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కుటుంబాలకు భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల సహకార సంఘం జిల్లా డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

పెడనలో అర్బన్ మార్కెట్



మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

పెడన, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో శుక్రవారం అర్బన్ మార్కెట్ నిర్వహించారు. స్టాళ్లను ఏర్పాటు చేసి డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించారు.

ఆకులమన్నాడులో డ్రై డే

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆకులమన్నాడు గ్రామంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై మల్లవోలు పీహెచ్‌సీ సిబ్బంది అవగాహనా సదస్సు నిర్వహించారు. సర్పంచ్ ఎండీ రఫీ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, సీహెచ్‌వో డాలీ సుకన్య, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి, ఆశ వర్కర్ రజని పాల్గొన్నారు.

వరిలో కలుపు యాజమాన్యంపై శిక్షణ

ఘంటసాల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో లంకపల్లి గ్రామంలో శుక్రవారం వరిలో కలుపు యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలుపును తాత్కాలికంగా నివారించడమే కానీ పూర్తిస్థాయిలో నిర్మూలించటం సాధ్యపడదని కేవీకే సమన్వయకర్త సుధారాణి తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.